టాప్ న్యూస్

## విజయవాడలోనూ.. చికెన్ బిర్యానే ఫేవరెట్



- స్విగ్గీ వార్షిక రిపోర్ట్
- 7.78 లక్షల ఆర్డర్లతో అగ్రస్థానం చికెన్ బిర్యానీ
- 3.2 లక్షల ఆర్డర్లతో రెండో స్థానంలో ఇడ్లీ

02

## తిరుమల కిటకిట



- సర్వదర్శనానికి 24 గంటలు

02

## ప్రియాంక చోప్రాపై మహేష్ బాబు ప్రశంసలు



- ట్రైలర్, నటన అద్భుతంగా ఉందంటూ సోషల్ మీడియాలో పోస్ట్

08

Follow: @ANNTELUGU

25-01-2026

# మహా పత్రిక

ANN తెలుగు

ఆదివారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 30 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



కంది రామచంద్రారెడ్డి

వీకెండ్ అనాలసిస్

## చట్టమా? చమత్కారమా?

చట్టమా? చమత్కారమా? విచారణ చేస్తున్నదెవరు? విచారణను ఎదుర్కొంటున్నదెవరు? సిట్ విచారణ... న్యాయపోరాటమా? లేక రాజకీయ నాటకమా? . రెండేళ్లయినా ముగింపు లేని ఫోన్ ట్యాపింగ్ కేసు, సింగరేణి టెండర్లపై కుంభకోణ ఆరోపణలు, మంత్రి కోమటిరెడ్డిపై కథనాలతో మొదలై ... కేంద్ర దర్యాప్తు దాకా వెళ్లిన రాజకీయ కథ. ఇపుడు ప్రభుత్వ విజయాల కంటే... వివాదాలే ఎక్కువగా చర్చకు వస్తున్నాయి. దావోస్ కంటే దర్యాప్తే హాట్ టాపిక్ గా మారింది. . సిట్ విచారణ... కార్తీకదీపం సీరియల్‌లా సాగుతుందా? ఎపిసోడ్‌ల మీద ఎపిసోడ్‌లు... కానీ క్లైమాక్స్ మాత్రం కనిపించడంలేదా? ప్రజల్లోనూ వీటిపై చర్చ జరుగుతున్న వేళ సిట్ దర్యాప్తు ప్రజలలో విశ్వాసం సన్నగిల్లకుండా చూడాలి. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మీడియా సమావేశంలో 2014 నుండి అన్ని టెండర్లపైనా విచారణకు సిద్ధమని సవాల్ చేశారు. ఈ క్రమంలో తెలంగాణ పాలిటిక్స్ లో కేంద్ర దర్యాప్తు.. బీఆర్ఎస్ రాజకీయాలు.. అధికారపార్టీ కౌంటర్లు. ఫైనల్‌గా తేలేదేమీ ఉండదన్న అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది.

**- తెలంగాణ తాజా రాజకీయాలపై ఏఎన్ఎన్ సీఈవో, సీనియర్ జర్నలిస్ట్ కంది రామచంద్రారెడ్డి వీకెండ్ అనాలసిస్**

ఎడిటోరియల్ పేజీ 4లో

## మున్సిపల్ ఎన్నికలకు ఇన్చార్జిలను నియమించిన కేటీఆర్

కేసీఆర్ ఆదేశాలతో నియామకం



**హైదరాబాద్, మహా :** తెలంగాణ రాష్ట్రంలో త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల కోసం బీఆర్ఎస్ తరఫున రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు మరియు కార్పొరేషన్ల వారీగా (ప్రత్యేక సమన్వయకర్తలను) పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నియమించారు. శనివారం పార్టీ అధినేత కేసీఆర్ తో భేటీ అయిన కేటీఆర్ అధినేత ఆదేశాల మేరకు కమిటీల నియామకం పూర్తిచేశారు.

మిగతా 2లో

## కేటీఆర్, హరీశ్ రావు ఎందుకు భయపడుతున్నారు?

మంత్రి జూపల్లి



**హైదరాబాద్, మహా :** అధికారంలో ఉన్న సమయంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన కేటీఆర్, హరీశ్ రావు ఇప్పుడు తగదునమ్మా అంటూ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని మంత్రి జూపల్లి కృష్ణారావు కౌంటర్ ఇచ్చారు. శనివారం ప్రజాభవన్‌లో మీడియాతో మాట్లాడిన జూపల్లి.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం తమను రాజకీయ కక్షతో వేధిస్తున్నదని కేటీఆర్, హరీశ్ రావు మాట్లాడుతున్నారని,

మిగతా 2లో

## కొంపలు ముంచిందే కేటీఆర్.. సాక్షిగా పిలిస్తే ఎలా?

కేంద్రమంత్రి బండి సంజయ్



**మహా :** ఫోన్ ట్యాపింగ్ కేసులో కొంపలు ముంచిందే కేటీఆర్ అని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. 'సిట్ విచారణకు కేసీఆర్ కొడుకును దోషిగా పిలిచారా? వాంగ్మూలం తీసుకునేందుకు పిలిచారా? అందరినీ సాక్షిగా పిలిస్తే దోషులెవరు? ఇలా చేస్తే ప్రభుత్వాన్ని ప్రజలు ఎలా నమ్ముతారు. తెలంగాణ ప్రజల కొంపలు ముంచినందుకు మా రక్తం మరుగుతోంది. రాష్ట్ర ముఖ్యమంత్రికి పౌరుషం లేదు. అటు విచారణలో అధికారులకు స్వేచ్ఛనివ్వట్లేదు' అని ఫైరయ్యారు.



# ఏ విచారణకైనా సిద్ధం

## సింగరేణిపై ఏ గద్దనూ వాలనివ్వం

## సృజన్ రెడ్డి బీఆర్ఎస్ లీడర్ అల్లుడే

### ఆరోపణలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కౌంటర్

**హైదరాబాద్, మహా**

సింగరేణి టెండర్లపై తాము విచారణకు సిద్ధమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శనివారం ప్రజాభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. సింగరేణి టెండర్లపై వస్తున్న ఆరోపణలపై ఎలాంటి విచారణకైనా సిద్ధమని, 2014 నుంచి నిర్వహించిన టెండర్లపై విచారణ చేయిద్దామని హరీశ్ రావుకు సవాల్ విసిరారు. టెండర్లపై సమగ్ర విచారణ కావాలంటే హరీశ్ రావు తనకే నేరుగా లేఖ రాయవచ్చని ఆహ్వానించారు. సీఎం రేవంత్ రెడ్డి అమెరికా నుంచి రాగానే విచారణ కోరుతామని స్పష్టం చేశారు.

మిగతా 2లో

### సృజన్ రెడ్డి బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే అల్లుడే

దేశంలో ఏ మైనింగ్ యాక్టివిటీలోనూ డీజిల్ సప్లై చేసే పరిస్థితి లేదని, కానీ, 2022 నైనీ బ్లాక్ టెండర్లలో డీజిల్ విధానాన్ని మార్చారని ఆరోపించారు. సింగరేణిలో 25 టెండర్లలో 20 బీఆర్ఎస్ హయాంలో, 5 తమ ప్రభుత్వ హయాంలో జరిగాయన్నారు. సోదా కన్‌స్ట్రక్షన్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ బీఆర్ఎస్ నేత కందాల ఉపేందర్ రెడ్డి అల్లుడు సృజన్ రెడ్డిది అని తెలిపారు. ఆ కంపెనీ ఎండీ ఆయన కూతురు దీప్తి రెడ్డి అని పేర్కొన్నారు. ఇందులో అంతా హరీశ్ రావు పార్టీకి చెందిన వాళ్లే ఉంటే, మాపై లేఖలు రాయడం ఏంటని భట్టి ప్రశ్నించారు. అసలు హరీశ్ రావుకు ఏం కావాలి..? ఎంక్వైరీ కావాలంటే హరీశ్ రావు నాకే లేఖ రాయొచ్చు కదా. 12ఏళ్లలో జరిగిన టెండర్లపై ఎంక్వైరీ జరపాలా..? తాడిచర్ల నుంచి నైనీ వరకు అన్నింటిపైనా దర్యాప్తు చేద్దాం. సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రానికి రాగానే చర్చించి విచారణకు ఆదేశిస్తామని భట్టి విక్రమార్క తెలిపారు.



# నాంపల్లిలో భారీ అగ్నిప్రమాదం

## అగ్నికీలల్లో చిక్కుకున్న ఆరుగురు.. అర్ధరాత్రి కొనసాగుతున్న రెస్క్యూ

**హైదరాబాద్, మహా :** హైదరాబాద్, మహా : నాంపల్లిలోని ఓ ఫర్నిచర్ దుకాణంలో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. బచాస్ ఫర్నిచర్ క్యసిల్‌లో ప్రమాదవశాత్తూ మంటలు చెలరేగాయి. నాలుగు అంతస్తుల భవనంలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో అగ్నిప్రమాదం జరిగింది. 10 ఫైరింజన్ల సాయంతో మంటలను ఆర్పేందుకు అగ్నిమాపక సిబ్బంది ప్రయత్నిస్తున్నారు. ఘటనాస్థలానికి భారీ క్రేన్లు చేరుకున్నాయి. అగ్నిప్రమాదంలో మొత్తం ఆరుగురు చిక్కుకున్నట్టు భావిస్తున్నారు. ఈ భవనంలో మూడు కుటుంబాలు పనిచేస్తాయి. సెల్లార్‌లో వాచ్‌మెన్ కుటుంబంలోని ఇద్దరు పిల్లలు, మరో కుటుంబంలోని నలుగురు చిక్కుకున్నట్టు సమాచారం. పిల్లల తల్లిదండ్రులు యాదమ, లక్ష్మి బయటకు వెళ్లిన సమయంలో ప్రమాదం జరిగింది. అఖిల్ (11), ప్రణీత్(7) ఆచూకీ తెలియాల్సి ఉంది. భవనంలో చిక్కుకున్న వారి కోసం రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. భవనం పరిసర ప్రాంతవాసులను అధికారులు ఖాళీ చేయిస్తున్నారు. పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడుతుండడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అగ్ని ప్రమాదం జరిగిన భవనంలోకి రోబోను పంపి ఫైర్ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. హైదరాబాద్ సీపీ సజ్జనార్, అగ్నిమాపక శాఖ డీజీ ఘటనా స్థలిని పరిశీలించి సహాయక చర్యలు పర్యవేక్షించారు.

# అందరి బాగోతాలను బయటపెడతాం

### ఫోరెన్సిక్ ఆడిట్‌తో సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాల్లో అక్రమాల గుర్తింపు

### ధరణి పోర్టల్ లొసుగుల వల్లే రిజిస్ట్రేషన్‌లలో అక్రమాలు

### 9 జిల్లాల్లోని 35 మండలాల్లో 48 మందిపై క్రిమినల్ కేసులు

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్, మహా :** ధరణి పోర్టల్‌లోని లొసుగులను ఆసరాగా చేసుకొని ప్రభుత్వ భూములను కొల్లగొట్టిన వారిని, రిజిస్ట్రేషన్‌ల చలానా సొమ్మును కాజేసినవారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకొని గత ప్రభుత్వంలోని పెద్దలు ప్రభుత్వ భూములను కాజేశారని, దీనిపై సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాల్లో కేంద్ర ప్రభుత్వ అనుబంధ సంస్థతో పైలట్ కింద ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించడం జరిగిందని ఇందులో అనేక అవినీతి అక్రమాలు జరిగినట్లు ప్రాథమిక నివేదికలో స్పష్టమైందని ఆయన తెలిపారు. ఈ ఫోరెన్సిక్ నివేదికను పరిశీలించిన తర్వాత మిగిలిన 31 జిల్లాల్లో కూడా ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహిస్తామని ప్రకటించారు. శనివారం సచివాలయంలోని తన కార్యాలయంలో ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకొని అక్రమాలకు పాల్పడిన సంఘటనలపై ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీతో మంత్రి పొంగులేటి సమావేశం నిర్వహించారు. విచారణలో ఎదురైన అంశాలు,ఎవరి పాత్ర ఎంత? తెరవెనుక ఎవరైనా ఉన్నారా? రెవెన్యూ అధికారుల పాత్ర ఏమైనా ఉందా? వంటి అంశాలపై కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు.

మిగతా 2లో

## నా కొడుకు, చిరంజీవి అందుకే వచ్చారు

ఫోన్ ట్యాపింగ్ లో ఎవరు ఉన్నా విచారణకు రావాల్సిందే...

చిట్ చాట్ లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

02

## భారత్‌పై 25% సుంకాలు తగ్గొచ్చు

- దావోస్ వేదికగా అమెరికా సంకేతాలు
- 50 శాతం నుండి 25 శాతానికి డౌన్

వివరాలు 2లో



## మున్సిపల్ ఎన్నికలకు ఇన్చార్జిలను నియమించిన కేటీఆర్

**కేసీఆర్ ఆదేశాలతో నియామకం**

(మొదటిపేజీ తరువాయి)

ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రతీ మున్సిపాలిటీకి ఒక సీనియర్ నాయకుడిని ఎన్నికల ఇంచార్జిగా బాధ్యతలు అప్పగించారు. క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను ఏకం చేయడం, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఎన్నికల వ్యూహాలను రూపొందించడం ఈ సమన్వయకర్తల ప్రధాన బాధ్యతగా ఉంటుంది. ఎన్నికల ప్రక్రియ ప్రారంభం నుండి ముగిసే వరకు వీరు నిరంతరం ఆయా మున్సిపాలిటీల్లో అందుబాటులో ఉంటారు. మున్సిపల్ ఎన్నికల్లో అత్యంత కీలకమైన అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో ఈ సమన్వయకర్తలు కీలక పాత్ర పోషిస్తారు. స్థానిక నాయకత్వంతో చర్చించి, గెలుపు గుర్రాలను గుర్తించి, నివేదికలను ఎప్పటికప్పుడు పార్టీ అధిష్టానానికి సమర్పిస్తారు. అంతేకాకుండా, పార్టీ రూపొందించిన ప్రచార కార్యక్రమాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లడం, బూత్ లెవల్ ఏజెంట్లను సమన్వయం చేయడం వంటి అంశాలను వీరు పర్యవేక్షిస్తారు.

## కేటీఆర్, హరీశ్ రావు ఎందుకు భయపడుతున్నారు?

**మంత్రి జూపల్లి**

(మొదటిపేజీ తరువాయి)

నిజంగానే కక్ష సాధింపే చేయాల్సి వస్తే మరో సెక్షన్ కింద నోటీసులు ఇచ్చి అరెస్టు చేసేవారు కదా అని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో మిమ్మల్ని కేవలం సీఆర్ పీసీ 160 కింద సాక్షులుగా మాత్రమే నోటీసులు ఇచ్చారని, నిందితులుగా పిలవలేదన్నారు. నిజంగానే ఫోన్ ట్యాపింగ్‌లో మీరు ఎలాంటి తప్పు చేయకుంటే ఎందుకు భయపడుతున్నారన్నారని నిలదీశారు. అధికారంలో ఉండగా చేయాల్సిందంతా చేసి ఇప్పుడు దిగజారి మాట్లాడితే చెల్లుబాటు కాదన్నారు. బీఆర్ఎస్ నేతల తీరు ఉల్టా చోర్ కొత్వాల్ కో డాంటా అన్నచందంగా ఉందని ఎద్దేవా చేశారు.

## ఏ విచారణకైనా సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

వాస్తవాలు తెలుసుకోకుండా అడ్డగోలుగా ఏది పడితే అది రాస్తే సాగదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క హెచ్చరించారు. తాను రాజకీయాల్లోకి ఆస్తులు సంపాదించుకునేందుకు రాలేదని, సమాజంలో మార్పు కోసమే వచ్చానని అన్నారు. తాను చేపట్టిన పాదయాత్ర సమయంలో కూడా సింగరేణి కోసం పోరాడానని గుర్తు చేశారు. సింగరేణిపై ఏ గద్దనూ వాలనివ్వనని.. బొగ్గు బావులు తెలంగాణకు ఎంత అవసరమో తనకు తెలుసని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు.

**అందుకే టెండర్ల రద్దు**

దేశంలోని చాలా కేంద్ర ప్రభుత్వ సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు సైట్ విజిట్ నిబంధనలు పక్కాగా అమలు చేస్తున్నాయని, తాము చేస్తే తప్పేముందని భట్టి విక్రమార్క నిలదీశారు. కానీ సైట్ విజిట్ అనే నిబంధన దేశంలో ఎక్కడా లేనట్లుగా దుష్ప్రచారం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నైనీ కోల్ బ్లాక్ టెండర్లు రద్దు చేయకపోతే ప్రజల్లో అపోహలు పెరుగుతాయని భావించి వెంటనే రద్దు చేయాలని చెప్పానని, ఆరోపణలు చేసిన వారు ఇప్పటికైనా తప్పు గ్రహించి తమ వ్యాఖ్యలను సరిచేసుకుంటారని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో మంత్రి జూపల్లి క్రిష్ణారావు పాల్గొన్నారు.



## నా కొడుకు, చిరంజీవి అందుకే వచ్చారు

ఫోన్ ట్యాపింగ్ లో ఎవరు ఉన్నా విచారణకు రావాల్సిందే

చిట్ చాట్ లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్, మహా :** దావోస్ పర్యటనకు తన కొడుకు రావడంపై ఆరోపణలు, విమర్శలు చేస్తున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మండిపడ్డారు. చిట్ చాట్ లో ఆయన మాట్లాడుతూ.. తన కుమారుడు బిజినెస్ పనిమీదనే దావోస్ వచ్చారని చెప్పారు. తన కుమారుడు, మెగాస్టార్ చిరంజీవి కూడా అందుకోసమే వచ్చారన్నారు. వాళ్లిద్దరికి ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టలేదని అన్నారు. తన కుమారుడిపై సోషల్ మీడియాలో విమర్శలు చేస్తున్నారని, తనపై భూ ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ఈడీ కేసుల గురించి మాట్లాడటం తప్ప మరొకటి ఏం లేదన్నారు. తాను ఎలాంటి కబ్జాలకు పాల్పడలేదని స్పష్టం చేశారు. భూభారతిలో రూ.3.9 కోట్ల రిజిస్ట్రేషన్ టాక్స్ అక్రమాలు జరిగాయన్నారు. ప్రతి మండలాన్ని యూనిట్ గా తీసుకుని కేసులు నమోదు చేశామని చెప్పారు. ధరణి అక్రమాలపై సిద్దిపేట, సిరిసిల్లలో కేరళ సంస్థ ఆడిట్ చేస్తోందని అన్నారు. నైని కోల్ మైన్స్ టెండర్లు రాకముందే అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అంతేకాకుండా ఫోన్ ట్యాపింగ్ లో ఎవరు ఉన్నా విచారణకు రావాల్సిందేనని స్పష్టం చేశారు.

# భారత్‌పై 25 శాతం సుంకాలు తగ్గొచ్చు

**దావోస్ వేదికగా అమెరికా సంకేతాలు.. 50 శాతం నుండి 25 శాతానికి డౌన్**



**మహా:** భారత్ కు త్వరలో అమెరికా శుభవార్త చెప్పనుంది. రష్యా నుంచి ముడి చమురు కొనుగోలు చేస్తున్నందుకు గానూ భారత్‌పై విధించిన అదనపు పన్నులను ఎత్తివేసే దిశగా అమెరికా యోచిస్తోంది. భారత్ నుంచి వచ్చే దిగుమతులపై ప్రస్తుతం అమలు చేస్తున్న 25 శాతం టారిఫ్‌లను త్వరలోనే వెనక్కి తీసుకునే అవకాశం ఉందని అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో ఈ దిశగా అమెరికా సంకేతాలు పంపింది. ఓ ఇంటర్వ్యూలో అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ మాట్లాడుతూ "రష్యా ఆయిల్ కొంటున్నందుకు మేం భారత్‌పై 25 శాతం పన్ను వేశాం. దీని ప్రభావం స్పష్టంగా కనిపించింది. భారత రిఫైనరీలు రష్యా నుంచి ఆయిల్ కొనడం దాదాపు మానేశాయి. అక్కడ కొనుగోళ్లు కుప్పకూలాయి. మా లక్ష్యం నెరవేరింది. ఇది కచ్చితంగా విజయమే. ప్రస్తుతం ఆ పన్నులు ఇంకా అమల్లోనే ఉన్నాయి. కానీ భారత్ ఇలాగే వ్యవహరిస్తే, దౌత్యపరమైన మార్గాల ద్వారా ఆ పన్నులను ఎత్తివేసే అవకాశం ఉంది. అదొక చెక్ పాయింట్ లాంటిది" అని బెసెంట్ వివరించారు. ఇదే సమయంలో ఆయన ఐరోపా దేశాల ద్వంద్వ వైఖరిని ఎండగట్టారు. "ఉక్రెయిన్ యుద్ధానికి ముందు భారత్ రష్యా నుంచి కేవలం 23 శాతం ఆయిల్ మాత్రమే కొనేది. ఆంక్షల తర్వాత రష్యా తక్కువ ధరకే ఆయిల్ ఇవ్వడంతో భారత్ కొనుగోళ్లు పెంచింది. భారత రిఫైనరీలు ఆ ఆయిల్‌ను శుద్ధి చేసి భారీ లాభాలకు మళ్లీ ఐరోపాకే అమ్ముతున్నాయి. ఇక్కడే అసలు ట్విస్ట్ ఉంది. ఆ రిఫైన్డ్ ఆయిల్‌ను యూరోపియన్లే కొంటున్నారు. అంటే పరోక్షంగా రష్యా ఆయిల్‌నే వాడుతున్నారు. మీపై జరిగే యుద్ధానికి మీరే డబ్బులు సమకూరుస్తున్నారు. రష్యాకు మీరే ఆర్థిక సాయం చేస్తున్నారు" అని బెసెంట్ యూరప్ దేశాలకు చురకలు అంటించారు.



ఖైరతాబాద్ నియోజకవర్గ ఎర్రమంజిల్ డివిజన్ దుర్గా నగర్ కాలనీ లో శ్రీ శ్రీ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల ముగింపు పూజా కార్యక్రమంలో పాల్గొని అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఖైరతాబాద్ నియోజకవర్గ ఆర్ ఎస్ పార్టీ ఇంచార్జ్ మన్నె గోవర్ధన్ రెడ్డి గారు ఈ కార్యక్రమంలో నిశాంత్ ముదిరాజ్ శంకర్ రాజు శ్రీనివాస్ హరీష్ గుప్తా మరియు స్థానికులు పాల్గొన్నారు

## వసంత పంచమి ఆర్జిత సేవల ఆదాయం

**ఆదిలాబాద్, మహా:** శుక్రవారం వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్మల్ జిల్లా బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. ఆర్జిత సేవల రూపంలో ఆలయానికి ఒక్కరోజులో 56 లక్షల 38వేల 275 రూపాయలు ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈవో అంజనాదేవి తెలిపారు.వసంత పంచమి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి ఆలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో తమ చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ప్రత్యేక వెయ్యి రూపాయల అక్షరాభ్యాసం టికెట్లు 3వేల 850, సాధారణ 150 రూపాలయ అక్షరాభ్యాసం టికెట్లు 2వేల 475, ప్రత్యేక దర్శనాలు, లడ్డూ, పులిహోర ప్రసాదం సహా వివిధ అర్జితసేవా టికెట్ల ద్వారా ఈ ఆదాయం సమకూరినట్టు ఆమె తెలిపారు.



## టీ-హబ్ స్టార్టప్ కేంద్రమే ప్రభుత్వ కార్యాలయాలొద్దు

**సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం**

**మహా:** హైదరాబాద్‌లోని ఐటీ కారిడార్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన టీహబ్ ప్రాంగణంలోకి ప్రభుత్వ కార్యాలయాలను తరలించాలనే ఆలోచనపై తెలంగాణ సర్కార్ వెనక్కి తగ్గింది. స్టార్టప్‌ల కేంద్రంగా, ఆవిష్కరణలకు నిలయంగా ఉన్న ఈ భవనంలో ఇతర కార్యాలయాలను ఏర్పాటు చేయడం వల్ల దాని ప్రాధాన్యత దెబ్బతింటుందన్న ఆందోళనల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. సీఎస్ కు ఫోన్ చేసి టీహబ్ ప్రత్యేకత కాపాడాలని, ఇతర ఆలోచనలు విరమించుకోవాలని సూచించారు.

## ఇద్దరు బీజేపీ ఎంపీలకు కేటీఆర్ షాక్

**మహా :** కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌లకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు తన న్యాయవాదుల ద్వారా లీగల్ నోటీసులు పంపించారు. ఈ నోటీసులో పలు అంశాలను ప్రస్తావించారు కేటీఆర్. తనపై, తన కుటుంబంపై నిరాధార, పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలు చేసినందుకు గానూ ఈ లీగల్ నోటీసులు జారీ చేసినట్టు స్పష్టం చేశారు. నోటీసులు అందిన ఐదు రోజుల్లోగా స్పందించని పక్షంలో, సివిల్, క్రిమినల్ చట్టాల ప్రకారం.. కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తన రాజకీయ ప్రతిష్ఠను దెబ్బతీసేలా, ప్రజల్లో తనపై ఉన్న నమ్మకాన్ని సడలించేలా వీరు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్నామని పేర్కొన్నారు.

## విజయవాడలోనూ.. చికెన్ బిర్యానే ఫేవరెట్

**స్విగ్గీ వార్షిక రిపోర్ట్**

7.78 లక్షల ఆర్డర్లతో అగ్రస్థానం చికెన్ బిర్యానీ

3.2 లక్షల ఆర్డర్లతో రెండో స్థానంలో ఇడ్లీ

**మహా:** తెలుగు రాష్ట్రాల్లో భోజన ప్రియుల ఫేవరెట్ అనగానే చికెన్ బిర్యానీనే గుర్తుకొస్తుంది. విజయవాడ వాసులు కూడా దీనికి మినహాయింపు కాదు. ప్రముఖ ఫుడ్ డెలివరీ యాప్ స్విగ్గీ విడుదల చేసిన 2025 వార్షిక నివేదికలోనూ ఇదే విషయం స్పష్టమైంది. అయితే, బిర్యానీ తర్వాత బెజవాడ వాసులు అత్యధికంగా ఇష్టపడుతున్నది మెత్తటి, తెల్లటి ఇడ్లీ. స్విగ్గీ వెల్లడించిన వివరాల ప్రకారం... 2025 జనవరి 1 నుంచి నవంబర్ 30 వరకు విజయవాడలో ఏకంగా 7.78 లక్షల చికెన్ బిర్యానీ ఆర్డర్లు నమోదయ్యాయి. గత కొన్నేళ్లుగా ఇదే ట్రెండ్ కొనసాగుతుండగా, ఈసారి కూడా బిర్యానీ తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. ఆ తర్వాత 3.2 లక్షల ఆర్డర్లతో ఇడ్లీ రెండో స్థానంలో నిలవడం విశేషం. సాధారణంగా టిఫిన్ ఐటమ్స్‌లో దోశకు ఎక్కువ ఆదరణ ఉంటుందనే అంచనాలను పక్కకు నెడుతూ ఇడ్లీ టాప్2లో చోటు దక్కించుకుంది. ఇక, 2.7 లక్షల ఆర్డర్లతో వెజ్ దోశ మూడో స్థానాన్ని దక్కించుకుంది.

# అందరి బాగోతాలను బయటపెడతాం

ఫోరెన్సిక్ ఆడిట్‌తో సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాల్లో అక్రమాల గుర్తింపు

ధరణి పోర్టల్ లొసుగుల వల్లే రిజిస్ట్రేషన్‌లలో అక్రమాలు

9 జిల్లాల్లోని 35 మండలాల్లో 48 మందిపై క్రిమినల్ కేసులు

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



(మొదటిపేజీ తరువాయి)

కమిటీ ప్రాథమిక నివేదికను పరిశీలించి మరికొన్ని సలహాలు సూచనలు చేస్తూ మరింత లోతైన విచారణ జరిపి తుది నివేదికను సమర్పించాలని సూచించారు.

**35వేల లావాదేవీలు.. 4వేలకు పైగా లోపాలు**

ధరణి పోర్టల్ ప్రారంభమైనప్పటినుంచి 35వేల లావాదేవీలు జరిగాయని ఇందులో ప్రాథమికంగా 4,848 లావాదేవీల్లో లోటుపాట్లు జరిగినట్లు గుర్తించడం జరిగిందని అయితే విచారణ తర్వాత 1109 డాక్యుమెంట్లకు సంబంధించి సుమారు నాలుగు కోట్ల రూపాయిలు ప్రభుత్వానికి చెల్లింపు జరగలేదని కమిటీ సభ్యులు మంత్రి కి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆనాటి ప్రభుత్వం అనాలోచితంగా ఎలాంటి ముందుచూపు లేకుండా ఒక కుట్రపూరితంగా తీసుకువచ్చిన ధరణి పోర్టల్ లోని లొసుగులను ఆసరాగా చేసుకొని కొంతమంది అక్రమాలకు పాల్పడితే భూభారతి పోర్టల్ ద్వారా ఆడిట్ నిర్వహించి అక్రమాలను గుర్తించి తక్షణమే ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసి విచారణ చేపట్టామని తెలిపారు. ఇందుకు సంబంధించి తొమ్మిది జిల్లాల్లోని 35 మండలాల్లో అక్రమాలకు పాల్పడిన 48 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. వాస్తవ పరిస్థితి ఇలా ఉంటే ప్రతిపక్షంలో ఉన్న ఓ నాయకుడు వెయ్యి కోట్ల అవినీతి అని, మరో నాయకుడు పదివేల కోట్లు అని ఇంకొక్కరు భూభారతి పోర్టల్ అవినీతిమయమని నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్, స్టాంప్స్ & రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, ఇంటిలిజెన్స్ అదనపు డిజి విజయ్‌కుమార్ ,ఉన్నతస్థాయి కమిటీ సభ్యులు డిఐజీ ఎమ్. సుభాషిని, సిఎమ్ఆర్‌వో మకరంద్, ఎసీబీ ఎస్పీ సింధు శర్మ, సైబర్ క్రైమ్ డిఎస్పీ ఎ. సంపత్, ఎన్ఐసి ప్రతినిధి శ్రీనివాస్ , హోంశాఖ సలహాదారు పి. శరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల కిటకిట.. సర్వదర్శనానికి 24గంటలు



**మహా :** కలియుగ దైవం శ్రీవేంకటేశ్వర స్వామి కొలువుదీరిన పుణ్యక్షేత్రం తిరుమల భక్తులతో కిటకిటలాడుతోంది. స్వామి వారి దర్శనం కోసం భక్తులు పోటెత్తుతున్నారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులతో తిరుమల జనసంద్రంగా మారింది. కొండపై ఉన్న అన్ని కంపార్టుమెంట్లు భక్తులతో నిండిపోయాయి. టోకెన్లు లేని భక్తులకు 24 గంటల్లో సర్వదర్శనం అవుతుందని టీటీడీ అధికారులు తెలిపారు.

## కాంగ్రెస్, బీఆర్ఎస్ ట్యాపింగ్ డ్రామా

**బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో జాప్యం.. బీజేపీ చీఫ్ రామచందర్ రావు ఫైర్**



**హైదరాబాద్, మహా:** ఫోన్ ట్యాపింగ్ అంశంపై తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు స్పందించారు. తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ రాజ్యాంగ ఉల్లంఘన అని అన్నారు. ఈ కేసును కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే జాప్యం చేస్తోందని ఆయన ఆరోపించారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు కలిసి ఫోన్ ట్యాపింగ్ డ్రామాకు తెరలేపాయని విమర్శించారు. ఈ కేసులో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ కలిసి ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయ కుట్రలు చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్‌తో నష్టపోయిన వారికి న్యాయం జరగాలంటే ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ వేగవంతం కావాలని, బాధ్యులపై త్వరగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## రష్యా-ఉక్రెయిన్ శాంతి చర్చలు

**అమెరికా ఒత్తిడితో అబుదాబిలో సంభాషణలు**



**మహా:** దాదాపు నాలుగేళ్లుగా కొనసాగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు దిశగా అబుదాబిలో శాంతి చర్చలు ప్రారంభమయ్యాయి. అమెరికా ఒత్తిడితో ఉక్రెయిన్ అంగీకరించడంతో ఇరు దేశాల ప్రతినిధులు చర్చల్లో పాల్గొంటున్నారు. 2022 ఫిబ్రవరిలో ప్రారంభమైన యుద్ధంలో రష్యా కీలక ప్రాంతాలపై దాడులు చేసింది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ మాట్లాడుతూ యుద్ధం ముగింపు రష్యా నిర్ణయంపైనే ఆధారపడి ఉందన్నారు. యూరప్ నుంచి భద్రతా హామీలు కావాలని ఉక్రెయిన్ కోరుతుండగా, డోనెస్క్‌పై రష్యా పట్టు బడుతోంది.

## కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు

**కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో కార్యక్రమం**

10, 23 వార్డుల నుండి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన మహిళలు,కాలనీ వాసులు

కండువాలు కప్పి స్వాగతించిన తాహెర్ బిన్ హందాన్, కంది శ్రీనివాసరెడ్డి

మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యమని పిలుపు




**ఆదిలాబాద్ మహా :** త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులను పెద్ద సంఖ్యలో గెలిపించుకొని మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకోవాలని జిల్లా పరిశీలకులు ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెబిన్ హందాన్, ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. శనివారం ఆదిలాబాద్ పట్టణంలోని కంది శ్రీనివాస రెడ్డి క్యాంప్ కార్యాలయం ప్రజా సేవాభవన్ లో జరిగిన చేరికల సమావేశానికి హాజరయ్యారు.10 వ వార్డునుండి మెంచు రజిత అల్చట్టి నాగన్న ఆధ్వర్యంలో ,23 వ వార్డు నుండి కావేటి జ్యోతి ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో మహిళలు కాలనీవాసులు తరలివచ్చారు.వారందరికి తాహెర్ బిన్ హందన్ కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి స్వాగతించారు.మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కంది శ్రీనివాస రెడ్డి నేతృత్వంలో ఇంత పెద్ద ఎత్తున పార్టీలోకి చేరికలు జరగడం మంచి పరిణామమన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని చేతి గుర్తుకే ఓటు వేయాలని ఆయన కోరారు. ఇక కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి కంది శ్రీనివాస రెడ్డి వివరించారు.ఇప్పటి వరకు అందించిన పథకాలకు తోడు మహిళలు ఎదురు చూస్తున్న మరొక పథకం నెలకు 2వేల 5వందలు త్వరలో మొదలు కానుందని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం తోనే అభివృద్ధి సాధ్యమని అందుకే అందరూ పార్టీని ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ గిమ్మ సంతోష్, డీసీసీబీ మాజీ చైర్మన్లు అడ్డి భోజారెడ్డి,ముడుపు దామోదర్ రెడ్డి , ఆసిఫాబాద్ మాజీ డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రాద్ , బాలూరి గోవర్ధన్ రెడ్డి ,యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి శాంతన్ రావు, కొండా గంగాధర్ ,లోక ప్రవీణ్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు కలాల శ్రీనివాస్, ఇమ్రాన్ ,రషీద్, రామ్ కుమార్, గంద్రత్ రాజు,అల్చెట్టి నాగన్న పాల్గొన్నారు.

## బీజేపీ కార్పొరేటర్ వంగ మధుసూదన్ రెడ్డి ఆకస్మిక మృతి



**చంపాపేట్ :** ఎల్‌బీ నగర్ నియోజకవర్గ పరిధిలోని చంపాపేట్ డివిజన్ బీజేపీ కార్పొరేటర్ వంగ మధుసూదన్ రెడ్డి ఆకస్మికంగా మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైటెక్ సిటీలోని స్టార్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శనివారం తుదిశ్వాస విడిచారు. ఆయన మృతి వార్త తెలియగానే చంపాపేట్ డివిజన్‌లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ప్రజాసేవలో ఎప్పుడూ ముందుండే నాయకుడిగా గుర్తింపు పొందిన మధుసూదన్ రెడ్డి, డివిజన్ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేశారు. స్థానిక సమస్యలపై చురుకుగా స్పందిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండే ప్రజాప్రతినిధిగా ఆయనకు మంచి పేరు ఉంది. వంగ మధుసూదన్ రెడ్డి అకాల మరణం పార్టీకి తీరని లోటుగా మారిందని, అలాగే చంపాపేట్ ప్రజల్లో తీవ్ర విషాదాన్ని మిగిల్చిందని పలువురు నాయకులు పేర్కొన్నారు. ఆయన భౌతిక దేహాన్ని ప్రజల దర్శనార్థం కర్మన్‌ఘాట్‌కు తరలించనున్నట్లు కుటుంబ వర్గాలు తెలిపాయి. మధుసూదన్ రెడ్డి కుటుంబ సభ్యులకు పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, స్థానికులు సంతాపం తెలియజేస్తున్నారు.



## మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం

- **కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో కార్యక్రమం**
- **ఘన స్వాగతం పలికిన కంది శ్రీనివాస రెడ్డి,స్థానిక కాంగ్రెస్ నాయకులు**
- **గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపు**

**ఆదిలాబాద్ మహా :** మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే లక్షంగా ముందుకు సాగాలని పార్టీ శ్రేణులకు మున్సిపల్ ఎన్నికల పార్లమెంట్ ఇంచార్జి సుదర్శన్ రెడ్డి దిశా నిర్దేశం చేశారు.ఆదిలాబాద్ పట్టణంలోని కంది శ్రీనివాస రెడ్డి గారి క్యాంపు కార్యాలయం ప్రజాసేవా భవన్ లో పురపాలక ఎన్నికల నేపథ్యం లో ఎమ్మెల్సి దండే విట్టల్,ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ , జిల్లా పరిశీలకులు తాహెర్ బిన్ హందాన్ లతో కలిసి పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి , డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్,ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ, బోథ్ అసెంబ్లీ ఇంచార్జి ఆడే గజేందర్ తో పాటు స్థానిక కాంగ్రెస్ శ్రేణులు వారికి ఘనస్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు.ఈ కార్యక్రమం లో ఆత్మ చైర్మన్ గిమ్మసంతోష్ ,జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్ రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్లు అడ్డి భోజారెడ్డి,ముడుపు దామోదర్ రెడ్డి, మాజీ డీసీసీబీ డైరెక్టర్ బాలూరి గోవర్ధన్ రెడ్డి, కొండా గంగాధర్, జైనథ్ టెంపుల్ కమిటీ చైర్మన్ అడ్డి రుకేష్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సంజీవ్ రెడ్డి, కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని ,గుడిపెల్లి నగేష్, భూపెల్లి శ్రీధర్, మునిగేల విట్టల్,ఉయికే ఇందిరా, షబానా, జబీనా,నల్వాల సుమ, నిర్మల్ ,ఆసిఫాబాద్ , కాగజ్ నగర్ ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలోని నాయకులు తదితరులు పాల్గొన్నారు.








## చెన్నూర్ మున్సిపాలిటీకి నిధుల వరద

**రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేకానంద**

మంచిర్యాల, మహా : మున్సిపాలిటీల ఎన్నికలవేళ మంచిర్యాల జిల్లా చెన్నూర్ మున్సిపాలిటీకి నిధుల వరదకు తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద శ్రీకారం చుట్టారు. శనివారం జిల్లాలోని చెన్నూర్ మున్సిపల్ పరిధిలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, చెన్నూర్ మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ లతో కలిసి 50 లక్షల రూపాయల నగరాభివృద్ధి నిధులతో చేపట్టిన ఖమాన నిర్మాణం, 1 కోటి రూపాయల నగరాభివృద్ధి నిధులతో వివిధ వార్డుల్లో కల్వర్టుల నిర్మాణం, 50 లక్షల రూపాయలతో పార్క్ ఏర్పాటుకు శంకుస్థాపనలు కార్యక్రమాలు చకచకా చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చెన్నూర్ పట్టణంలో దాదాపు 50 కోట్ల రూపాయల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని వెల్లడించారు. వీటితోపాటు 50 లక్షల రూపాయలతో ఖమాన నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. చెన్నూరు మున్సిపాలిటీలో ప్రజల సౌకర్యార్థం స్మశాన వాటిక ఏర్పాటులో భాగంగా 1 ఎకరం విస్తీర్ణం గల భూమిని సేకరించి 1 కోటి 20 లక్షల రూపాయల సి.ఎస్.ఆర్. నిధులతో పనులు చేపట్టినట్లు స్పష్టం చేశారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం సమీపంలో గల ప్రాంతాన్ని పార్క్ గా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, జిమ్, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు కొరకు 1 కోటి రూపాయలతో పనులు కూడా చేపట్టడం జరిగిందని తెలిపారు. ప్రజల అభీష్టం మేరకు చెన్నూర్ పట్టణంలో ఆర్ టి సి డిపో ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని చెప్పారు. పట్టణ ప్రజల సౌకర్యార్థం కొరకు చెన్నూర్ నుండి హైదరాబాద్ కు బస్సు నడిపించడం జరుగుతుందని వెల్లడించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2 కోట్ల రూపాయలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1 కోటి 50 లక్షల రూపాయలతో పనులు కొనసాగుతున్నాయని, 50 లక్షల రూపాయలతో ముదిరాజ్, 30 లక్షల రూపాయలతో మున్నూరు కాపు కమ్యూనిటీ హాల్ లో ఏర్పాటు చేయడం జరుగుతుందని, 15 లక్షల రూపాయల సి.ఎస్.ఆర్. నిధులతో మెరుగు సంఘ భవనం ఏర్పాటుకు ప్రతిపాదనలు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. చెన్నూరు నియోజకవర్గ పరిధిలో ప్రజా ప్రయోజనార్థం అంతర్గత రహదారులు, మురుగు కాలువల నిర్మాణాలు చేపట్టడం జరిగిందని తెలిపారు. ప్రజల త్రాగునీటి సమస్యను పరిష్కరించడంలో భాగంగా నియోజకవర్గ వ్యాప్తంగా 250 బోర్ వెల్ ఏర్పాటు చేయడం జరిగిందని, అమృత్ పథకంలో భాగంగా 30 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన పనులు 50 శాతం పూర్తయ్యాయని, పనులు వేగవంతం చేసి ఇంటింటికీ నల్లా కనెక్షన్ ద్వారా నిరంతరం త్రాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం చేపట్టి పనులు కొనసాగుతున్నాయని అన్నారు. చెన్నూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన డయాలసిస్ యూనిట్ ద్వారా వీటిని వ్యాధిగ్రస్తులకు వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత ప్రభుత్వాధికారులు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## దళితులను వేధింపులకు గురి చేయవద్దు

**రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య**



**నిర్మల్ మహా :** దళితులపై వేధింపులు తగవని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. శనివారం నిర్మల్ జిల్లా సోన్ మండలం పాక్‌పట్ల గ్రామంలో ఆయన పర్యటించారు. గ్రామంలోని దళితులకు చెందిన భూములను వారి ఇష్టానికి విరుద్ధంగా, బలవంతంగా తీసుకుంటున్నారన్న ఫిర్యాదులపై ఆయన స్పందించారు. భూ యజమానులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూ యజమానుల సమ్మతి లేకుండా వారి భూములను స్వాధీనం చేసుకునే హక్కు ఎవరికీ లేదని స్పష్టం చేశారు. చట్టాన్ని అతిక్రమించే అధికారం ఎవరికీ లేదని, దళితుల హక్కులకు భంగం కలిగించే చర్యలను ప్రభుత్వం సహించదని అన్నారు. దళిత రైతులు స్వచ్ఛందంగా ఇచ్చినంత భూమిని మాత్రమే తీసుకోవాలని, వారి ఇష్టానికి విరుద్ధంగా బలవంతంగా భూములు స్వాధీనం చేసుకుంటే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామ అభివృద్ధి కమిటీల పేరుతో చట్టాన్ని చేతిలోకి తీసుకుని అనధికారికంగా దళితులను వేధింపులకు గురి చేయవద్దని సూచించారు. గ్రామంలో శాంతి భద్రతలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని, అందరూ అన్నదమ్ముల్లా కలిసి మెలిసి ఉండాలని తెలిపారు. గ్రామంలో సివిల్ రైట్స్ కార్యక్రమాన్ని నిర్వహించి, గ్రామస్తులకు చట్టాలు, హక్కులపై పూర్తి అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. దళితులను వేధింపులకు గురి చేయవద్దని, అలాంటి ఘటనలు చోటుచేసుకుంటే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సాయికిరణ్, ఆర్డీవో రత్న కళ్యాణి, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి దయానంద్, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ శంకర్, తహసిల్దార్ మల్లేష్, అధికారులు పాల్గొన్నారు.

## రంజాన్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

**మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి చంద్రయ్య**



**మంచిర్యాల, మహా :** రంజాన్ పండుగను మత సమరస్యంతో ప్రశాంతంగా జరుపుకోవాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి చంద్రయ్య అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ భవన సమావేశ మందిరంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, మంచిర్యాల ఎ. సి. పి. ప్రకాష్ లతో కలిసి మండలాల తహసిల్దారులు, మున్సిపల్ కమిషనర్లు, ముస్లిం మత పెద్దలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రంజాన్ మాసంను పురస్కరించుకొని పండుగను సామరస్యంగా, శాంతియుత వాతావరణంలో సంతోషంగా జరుపుకోవాలని తెలిపారు. రంజాన్ మాసం, ఇఫ్తార్ నిర్వహణ కొరకు సంబంధిత శాఖల సమన్వయంతో పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. త్రాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ సరఫరా, ఇతర సౌకర్యాలపై శ్రద్ధ వహించాలని, ప్రార్థన సమయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. రంజాన్ మాసంలో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ అధికారులు, సంబంధిత అధికారుల సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని, మార్కెట్, మసీదుల సమీపంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మసీదులు, ప్రార్థనా మందిరాలు, ప్రజా ప్రదేశాలలో పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, అంతర్గత రహదారులలో సరైన లైటింగ్ వ్యవస్థ నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఆరోగ్య జీవితానికి క్రీడలు ఎంతో అవసరం:ఎస్ఐ బి.వెంకటేష్



**ఆమనగల్లు, మహా:** ఆరోగ్యకర జీవితానికి క్రీడలు ఎంతో అవసరమని ఆమనగల్లు ఎస్ఐ బి.వెంకటేష్ అన్నారు. ఆమనగల్లు మండలంలోని లెనోరా హైస్కూల్ లో వార్షిక క్రీడా దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్ఐ వెంకటేష్ హాజరై పాఠశాల చైర్మన్ దాసరి లలిత్ క్రిష్ణ తో కలిసి క్రీడాజ్యోతి వెలిగించి, విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ.. క్రీడలు మానసికోల్లాసం,ఆరోగ్యకరమైన జీవితం, భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవడానికి ఎంతోగానో ఉపయోగపడుతాయన్నారు. చిన్నారుల విన్యాసాలతో ఆకట్టుకున్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం దాసరి విద్య,అర్తి నిగమ్,రేష్మ బేగం పాల్గొన్నారు.

## ఆన్లైన్ లోనే ఇసుక బుకింగ్

**టీజీఎండిసి వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్, మైన్స్& జియోలజీ డైరెక్టర్ భవేశ్ మిశ్రా**




**కరీంనగర్ మహా :** ఇసుక అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా ఆన్లైన్ విధానంలోనే ఇసుక బుకింగ్ విధానం ప్రవేశ పెట్టనుందని రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్, మైన్స్& జియోలజీ డైరెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. ప్రయోగత్మకంగా రాష్ట్రంలోని 4 జిల్లాల్లో ఆన్లైన్ విధానం అమలు చేయనున్న నేపథ్యంలో కరీంనగర్ కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులతో టీజీఎండిసి ఆధ్వర్యంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో టీజీఎండిసి వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ ఇసుక ఆన్లైన్ ప్రక్రియలో భాగంగా 'మన ఇసుక వాహనం' యాప్ ద్వారా ఆన్‌లైన్ విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెడుతోందని అన్నారు. ఈ నూతన విధానం ద్వారా వినియోగదారులకు ఇసుక సరఫరాను మరింత పారదర్శకంగా మార్చడమే కాకుండా, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా ఇసుకను పొందేలా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. దీని వల్ల భవన నిర్మాణ రంగంలో ఇసుక కొరత తీరడమే కాకుండా, అక్రమ రవాణా అరికట్టవచ్చని అన్నారు. పూర్తిగా ఆన్లైన్ లోనే రవాణా జరగాలని, మాన్యువల్ రసీదులు జారీ చేయవద్దని తెలిపారు. ఇందిరమ్మ నిర్మాణం కోసం ఈ యాప్ లో ప్రత్యేక అప్షన్ ఇచ్చామని తెలిపారు. 25 క్యూబిక్ మీటర్ల ఇసుకను ఇందిరమ్మ లబ్ధిదారులు పొందవచ్చని అన్నారు. ప్రయోగాత్మక జిల్లాల అనంతరం ఇసుక నిల్వలు ఉన్న రాష్ట్రంలోని సుమారు 16 జిల్లాల్లో ఈ విధానం ప్రవేశపెడతామని తెలిపారు. ఇసుక అవసరం ఉన్నవారు మొబైల్లో మన ఇసుక వాహనం యాప్ డౌన్లోడ్ చేసుకుని బుక్ చేసుకోవాలని, లేదా టీజీఎండిసి ఆన్లైన్ లో బుక్ చేసుకోవాలని తెలిపారు. స్మార్ట్ ఫోన్లు లేనివారు గ్రామపంచాయతీ కార్యదర్శులని సంప్రదించి బుక్ చేసుకోవాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ మన ఇసుక వాహనం ఆన్లైన్ బుకింగ్ విధానం అమలు కోసం జిల్లాను ఎంపిక చేసినందున అధికారులు నిబద్ధతతో పనిచేసి విజయవంతమయ్యేలా చూడాలని అన్నారు. తహశీల్దార్లు పకడ్బందీగా విధులు నిర్వర్తించాలని, ఆర్డీవోలు పర్యవేక్షించాలని ఆదేశించారు. రెవిన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, రవాణాశాఖ అధికారులు సమన్వయంతో నూతన ఇసుక విధానానికి అనుగుణంగా పని చేయాలన్నారు. కొత్త పాలసీకి అనుగుణంగా 15 రోజుల్లోగా ఏర్పాట్లు తీసుకోవాలని, సందేహాలు ఉంటే టీజీఎండిసి అధికారులతో నివృత్తి చేసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మి కిరణ్, మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జయరాజ్, ప్రాజెక్టు మేనేజర్ రాధాకృష్ణ, తహశీల్దార్లు, మైనింగ్, హౌసింగ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బాలికలు అన్ని రంగాలలో రాణించాలి



**మంచిర్యాల, మహా :** బాలికలు అన్ని రంగాలలో రాణించాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ లు అన్నారు. శనివారం జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ భవన సమావేశ మందిరంలో జిల్లా స్త్రీ, శిశు, వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలలో జిల్లా సంక్షేమశాఖ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ యాదయ్య, జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి శంకర్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికలు విద్యతో పాటు అన్ని రంగాలలో రాణించాలని అన్నారు. బాలికలను రక్షిద్దాం బాలికలను చదివిద్దాం కార్యక్రమంలో భాగంగా బాలికల సంరక్షణ కొరకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతుందని, బాలికలకు అవకాశం ఇస్తే అన్ని రంగాలలో అద్భుతంగా ఆకాశాన్ని అందుకుంటారని అన్నారు. భ్రూణహత్యల నివారణ, బాల్యవివాహాల నియంత్రణ చర్యల ద్వారా బాలికలను రక్షించుకొని అణిచివేతకు గురి కాకుండా ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టడం జరుగుతుందని, బాలికలకు జీవించే హక్కు, రక్షణ హక్కు, అభివృద్ధి హక్కు, భాగస్వామ్య హక్కు లాంటి ఎన్నో హక్కులను కల్పించడం జరిగిందని వెల్లడించారు. బాలికల రక్షణ కొరకు అన్ని శాఖల సమన్వయంతో ముందుకు వెళ్ళాలని తెలిపారు. బేటి బచాబో బేటి పడావో ద్వారా భ్రూణహత్యలను నియంత్రించి ఆడపిల్లల లింగ నిష్పత్తిని పెంచడం జరిగిందని, కస్తూరిభా గాంధీ బాలికల విద్యాలయాల ద్వారా తెలంగాణలో బాలిక విద్యను ప్రోత్సహించడంతో పాటు పాఠశాలలలో మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందని తెలిపారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా క్యాంటీన్లు, వివిధ వ్యాపారాలలో మహిళ భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తూ చేయూత అందించడం జరుగుతుందని తెలిపారు. పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని తెలిపారు. బాలికలు సమాజంలో జరుగుతున్న ప్రతి అంశాన్ని తెలుసుకోవాలని, ప్రతి విషయంలో నైపుణ్యం పెంపొందించుకొని ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని తెలిపారు. అనంతరం జాతీయ బాలికల దినోత్సవం సంబంధిత గోడ ప్రతులను ఆవిష్కరించారు. బేటి బచావో భేటీ పడావో ప్రతిజ్ఞ చేశారు. చదువుతో పాటు క్రీడలు, నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందిన బాలికలకు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బ్యాంకు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ కు వినతి



**అమనగల్లు, మహా:** మాడ్గుల మండల కేంద్రంలోని నాగిళ్ళ గ్రామ పంచాయతీలో బ్యాంకు ఏర్పాటు చేయాలని శనివారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కు మాజీ మార్కెట్ డైరెక్టర్ సురమల్ల సుభాష్, స్థానిక నేతలు వినతి పత్రం అందజేశారు. బ్యాంకు లేక ఫిరోజ్ నగర్, కాట్రాగాని తాండ, కొర్ర తండా, దొడ్లపహాడ్ పరిసర ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని,ఈ సందర్భంగా వ్యాపార లావాదేవీలతోపాటు ఇతర రైతులకు సంబంధించిన కార్యకలాపాలు కొనసాగుతున్నాయని వారు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన అందుకు అనుగుణంగా బ్రాంచ్ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు సుభాష్ తెలిపారు. కార్యక్రమంలో అంబేద్కర్ జగ్జీవన్ రామ్ యువజన సంఘాల అధ్యక్షుడు బరిగెల రాములు, టిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు సురమల్ల చెన్నయ్య, మాజి వార్డు సభ్యులు పులికంటి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## యువత క్రీడల్లో రాణించాలి

**రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మన్ గోలీ శ్రీనివాస్ రెడ్డి**

**ఆమనగల్లు, మహా:** యువత క్రీడల్లో రాణించాలని క్రీడల వల్ల మానసిక ఉల్లాసం కలుగుతుందని రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మన్ గోలీ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీలోని అయ్యప్ప కొండ ఆవరణలో జబ్బు మహేష్ జ్ఞాపకార్థం మిత్రమండలి సభ్యులు చలిచీమల సతీష్, కొమ్ము ప్రసాద్, నాగిళ్ల లక్ష్మణ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మున్సిపాలిటీ స్థాయి టోర్నమెంట్ కు గోలి శ్రీనివాసరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఫైనల్ కు వచ్చిన రెండు జట్టులను అభినందించి పరిచయం చేసుకున్నారు. టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గోలి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతగానో దోహదపడతాయని అన్నారు. యువత క్రీడల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించాలని సూచించారు. ఓటమిని తొలిమెట్టుగా తీసుకుని ముందుకెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో అడ్వకేట్ దుడ్డు ఆంజనేయులు యాదవ్, చంద్రశేఖర్ రెడ్డి, అంజీ నాయక్, ఒగ్గు మహేష్, వడ్డే రాజు, రంజిత్, సుమన్ నాయక్, పూసల భాస్కర్, జంతుక కిరణ్, విటాయిపల్లి రమేష్, మహేందర్ గౌడ్, గబ్బర్ యాదవ్, గుజ్జరి గోపి, గణేష్, శివ, అక్రమ్, తదితరులు పాల్గొన్నారు.

## గొర్రెల మందను ఢీకొట్టిన లారీ... 18 గొర్రెలు మృతి

**మందమర్రి, మహా :** మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధి మహా రెస్టారెంట్ దగ్గరి జాతీయ రహదారిపై నుండి వెళుతున్న లారీ గొర్రెల మందం ఢీ ఘటన శనివారం విషాద నిరంపింది. స్థానిక ఎస్సై గోపతి నరేష్ కథనం ప్రకారం మంచిర్యాల వైపు నుండి బెల్లంపల్లి వైపు నాలుగు వరసల రోడ్డు నంబర్ 363 పై వెళుతున్న లారీ మహా రెస్టారెంట్ దగ్గర రోడ్డు దాటుతున్న గొర్రెలను వేగంగా లారీ ఢీకొట్టడంతో నార్లపూర్ గ్రామానికి చెందిన ఆర్కటి మొండి, ఆర్కటి సదానందం, చిట్టవేణి మల్లయ్యకు చెందిన మొత్తం 18 గొర్రెలు మృతి చెందినట్లు ఆయన వెల్లడించారు. ప్రమాదంలో గాయపడిన గొర్రె పిల్లలకు తక్షణమే వైద్య చికిత్స కొరకు పశువుల ఆసుపత్రికి తరలించారు. కాగా గొర్రెల యజమానులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు. మృతి చెందిన గొర్రెల విలువ దాదాపు లక్ష ఇరవై వేల రూపాయల నుండి 1,50,000 వరకు ఉంటుందని గొర్రెల యజమానులు కన్నీరు మున్నీరవుతున్నారు.

## రోడ్డు భద్రతా నియమాలు పాటించండి..

**కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**



**కరీంనగర్, మహా:** 37వ జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని అరైవ్ అలైవు అవగాహన కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ ఆధ్వర్యంలో శనివారం నగరంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.

**హెల్మెట్ ధారణ ప్రాణరక్ష - కలెక్టర్ పమేలా సత్పతి**

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గౌరవ డీజీపీ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన అరైవ్ అలైవు కార్యక్రమం జిల్లాలో పకడ్బందీగా అమలు అవుతోందని తెలిపారు. ప్రపంచంలోనే అత్యధికంగా మన దేశంలో 22 కోట్ల 10 లక్షల బైక్‌లు ఉన్నాయని, ప్రమాదాలు జరిగినప్పుడు తలకి గాయం కాకుండా ఉంటే ప్రాణాపాయం తప్పుతుందని గుర్తుచేశారు. వాహనదారులు వ్యక్తిగత భద్రత పాటిస్తూనే, ఇతరులను కూడా చైతన్య పరచాలని పిలుపునిచ్చారు. ర్యాలీలో పాల్గొన్న వారికి పోలీస్ శాఖ తరపున హెల్మెట్లను పంపిణీ చేశారు.

**90% ప్రమాదాలను నివారించవచ్చు - సీపీ గౌష్ ఆలం**

కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ గతేడాది గణాంకాలను వివరించారు. గత ఏడాది కమిషనరేట్ వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల్లో 200 మంది మరణించగా, అందులో 40 శాతం (80 మంది) టూవీలర్ వాహనదారులే. మరణించిన వారిలో 90 శాతం మంది హెల్మెట్ ధరించకపోవడం వల్లే ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు భద్రతా నియమాలను తూచా తప్పకుండా పాటిస్తే 90 శాతం ప్రమాదాలను నివారించవచ్చని, ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

**కొనసాగిన ర్యాలీ మార్గం:**

పోలీస్ పరేడ్ గ్రౌండ్ నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ.. బస్ స్టేషన్, ప్రతిమ మల్టీప్లెక్స్, గీతాభవన్ చౌరస్తా, మంకమ్మతోట, శివ థియేటర్ సర్కిల్, కెమిస్ట్ భవన్, కోర్ట్ చౌరస్తా, మంచిర్యాల చౌరస్తా, గాంధీ చౌరస్తా, కమాన్ చౌరస్తా మీదుగా సాగి తిరిగి పరేడ్ గ్రౌండ్‌లో ముగిసింది. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ సోహం, అడిషనల్ డీసీపీలు వెంకటరమణ, భీంరావు, ఏసీపీలు వెంకటస్వామి, యాదగిరిస్వామి, ఇన్స్పెక్టర్లు రాంచందర్ రావు, సృజన్ రెడ్డి, తిరుమల్ మరియు పోలీస్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయం:సుంకిరెడ్డి



**ఆమనగల్లు, మహా:** మాడుగుల మండలం ఆర్కపల్లి గ్రామంలో నర్సంపల్లి డా.తుమ్మేటి బాల్ రెడ్డి కుటుంబ సభ్యుల సహకారంతో శంకర నేత్రాలయ ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి హజరై మాట్లాడుతూ సొంత గ్రామానికి ఎంతో కొంత మేలు చేయాలనే ఆలోచనతో అమెరికాలో ఉన్న తుమ్మేటి బాల్ రెడ్డి కుటుంబ సభ్యులు కలిసి ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. ప్రజలు కంటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగకరమని ఆయన తెలిపారు.ఈ ప్రాంత పరిసర గ్రామాల నిరుపేద ప్రజలకు ఉచితంగా ఖరీదైన వైద్యం అందించడం అభినందనీయమని, ఇంత మంచి అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు .ఈ కార్యక్రమంలో నిర్వాహకులు డా ,తుమ్మేటి బాల్ రెడ్డి భారతి,గ్రామ సర్పంచ్ భాగ్యలక్ష్మి తిరుపతి రెడ్డి, తహశీల్దార్ వినయ్ సాగర్,సిఐ నాగరాజు, ఎంఈఓ సర్దార్ నాయక్, ఉప సర్పంచ్ రవిందర్, మాజీ సర్పంచ్ హన్మా నాయక్ నర్సిరెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రాజు జైపాల్ రెడ్డి గ్రామస్తులు పరిసర గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



**కమ్యూనిస్టు పార్టీ నిబద్ధతకు నిలువెత్తు**

## నిదర్శనం సయ్యద్ అప్సర్

**రాజేంద్రనగర్, మహా ;** సీపీఐ పార్టీ పట్ల నిబద్ధత, నాయకుల పట్ల గౌరవానికి ప్రతీకగా నిలిచే నాయకుని సీపీఐ మండల కార్యదర్శి నర్రగిరి తన రాజకీయ గురువు రాష్ట్ర నాయకులు సయ్యద్ ఆఫ్సార్‌ను శనివారం ఆయన నివాసంలో శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నర్రగిరి మాట్లాడుతూ తన రాజకీయ జీవితానికి మార్గదర్శకుడిగా నిలిచిన సయ్యద్ ఆఫ్సార్‌ను ఆయన స్వగృహంలో కలిసి సత్కరించడం ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. పార్టీ కోసం, ప్రజల కోసం పోరాడే తత్వాన్ని తనలో నాటిన రాజకీయ గురువు ఆఫ్సార్ సూచనలు, సలహాలతో భవిష్యత్తులో పార్టీకి మరింత అంకితభావంతో పని చేస్తానన్నారు.

WEEKEND ANALYSIS
వీకెండ్ అనాలసిస్

# చట్టమా? చమత్కారమా?

చట్టమా? చమత్కారమా? విచారణ చేస్తున్నదెవరు? విచారణను ఎదుర్కొంటున్నదెవరు? సిట్ విచారణ... న్యాయపోరాటమా? లేక రాజకీయ నాటకమా? . రెండేళ్లయినా ముగింపు లేని ఫోన్ ట్యాపింగ్ కేసు, సింగరేణి టెండర్లపై కుంభకోణ ఆరోపణలు, మంత్రి కోమటిరెడ్డిపై కథనాలతో మొదలై... కేంద్ర దర్యాప్తు దాకా వెళ్లిన రాజకీయ కథ. ఇపుడు ప్రభుత్వ విజయాల కంటే... వివాదాలే ఎక్కువగా చర్చకు వస్తున్నాయి. దావోస్ కంటే దర్యాప్తే హాట్ టాపిక్ గా మారింది. . సిట్ విచారణ... కార్తీకదీపం సీరియల్‌లా సాగుతుందా? ఎపిసోడ్‌ల మీద ఎపిసోడ్‌లు... కానీ క్లైమాక్స్ మాత్రం కనిపించడంలేదా? ప్రజల్లోనూ వీటిపై చర్చ జరుగుతున్న వేళ సిట్ దర్యాప్తు ప్రజలలో విశ్వాసం సన్నగిల్లకుండా చూడాలి. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మీడియా సమావేశంలో 2014 నుండి అన్ని టెండర్లపైనా విచారణకు సిద్ధమని సవాల్ చేశారు. ఈ క్రమంలో తెలంగాణ పాలిటిక్స్ లో కేంద్ర దర్యాప్తు.. బీఆర్ఎస్ రాజకీయాలు.. అధికారపార్టీ కౌంటర్లు. ఫైనల్ గా తేలేదేమీ ఉండదన్న అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది.

**- తెలంగాణ తాజా రాజకీయాలపై ఏఎన్ఎన్ సీఈవో, సీనియర్ జర్నలిస్ట్ కంది రామచంద్రారెడ్డి వీకెండ్ అనాలసిస్**



కంది రామచంద్రారెడ్డి
వీకెండ్ అనాలసిస్



"నేనే సిట్ అధికారులను వంద ప్రశ్నలు అడిగా" అని మాజీ మంత్రి హరీష్ రావు, "నా ప్రశ్నలకు సిట్ అధికారులే నీళ్లు నమిలారు" అని మాజీ మంత్రి కేటీఆర్ ఏడున్నర గంటలకు పైగా జూబ్లీహిల్స్ లో విచారణకు హాజరైన అనంతరం మీడియాతో వ్యాఖ్యానించారు. అంటే...

ఇక్కడ విచారణ ఎవరు చేస్తున్నారు? విచారణకు పిలిచినవారా? లేక విచారణకు వెళ్లినవారా? ఈ ప్రశ్నలే నేటి రాజకీయ వాతావరణానికి అద్దం పడుతున్నాయి. తెలంగాణ రాజకీయ వాతావరణం ఒక విచిత్ర మలుపు తిరిగింది. సిట్ విచారణలు...నోటీసులు...మీడియా ముందుకొచ్చే నేతల వ్యాఖ్యలు... అన్నీ కలిసిపోయి, చట్టం అనే పవిత్ర భావనను రాజకీయ వ్యూహాల మైదానంలోకి లాగుతున్నారనే అభిప్రాయాలు కలుగుతున్నాయి.

## మారిన దృశ్యం

ఒకప్పుడు... కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఉన్న రేవంత్ రెడ్డిని అర్ధరాత్రి తలుపులు బద్దలు కొట్టి కీలకమైన ఎన్నికల సమయంలో ఎత్తుకెళ్లారు. డ్రోన్ సహాయంతో జన్వాడ ఫామ్ హౌజ్ వీడియోలు బయటపెట్టారని, భయానక వాతావరణం సృష్టించి మల్కాజ్ గిరి ఎంపీగా ఉన్న రేవంత్ రెడ్డిని అనూహ్యంగా అరెస్ట్ చేసి.. చర్లపల్లి జైలుకు తరలించారు. యుద్ధప్రాతిపదికన డిటెన్షన్ సెల్‌లో నిర్బంధించారు. 16రోజులు నిద్రలేని రాత్రులు గడిపానని రేవంత్ రెడ్డి అనేక సందర్భాల్లో చెప్పారు. ఇటీవల ఈ కేసును కొట్టివేశారు. కానీ జైలులో నిద్రలేని రాత్రుల అనుభవం అలాగే ఉంది.

బండి సంజయ్‌ను... హిందీ ప్రశ్నాపత్రం లీక్ చేశారని అభియోగంతో అరెస్ట్ చేశారు. బిజెపి చీఫ్ గా ఉన్న బండి సంజయ్ ను పదవతరగతి హిందీ ప్రశ్నాపత్రం లీకు కేసులో అరెస్ట్ చేయడం కేసీఆర్ ప్రభుత్వం ఉన్నపుడు ఎంత మొండిగా, కఠినంగా వ్యవహరించిందో అద్దంపడుతుంది. కేంద్ర ప్రభుత్వం ఉన్నా కొన్ని గంటలపాటు బండిసంజయ్ ను ఏ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్తున్నారో, ఏ మార్గంలో తీసుకెళ్తున్నారో కూడా చెప్పకుండా, రాత్రంతా హై టెన్షన్ క్రియేట్ చేశారు. కరీంనగర్ లో అదుపులోకి తీసుకుని అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు కరీంనగర్, సిద్దిపేట, వరంగల్ జిల్లాల్లోని వేర్వేరు పోలీస్ స్టేషన్ల చుట్టూ తిప్పారు. చివరకు బొమ్మల రామారం పోలీస్ స్టేషన్‌లో ఉంచారు. తెలంగాణ జనసమితి అధ్యక్షుడు, ప్రొఫెసర్ కోదండరామ్ ను కూడా పోలీసులు తలుపులు పగులగొట్టి అరెస్ట్ చేశారు.

> "నేనే సిట్ అధికారులను వంద ప్రశ్నలు అడిగా" అని మాజీ మంత్రి హరీష్ రావు, "నా ప్రశ్నలకు సిట్ అధికారులే నీళ్లు నమిలారు" అని మాజీ మంత్రి కేటీఆర్ ఏడున్నర గంటలకు పైగా జూబ్లీహిల్స్ లో విచారణకు హాజరైన అనంతరం మీడియాతో వ్యాఖ్యానించారు. అంటే... ఇక్కడ విచారణ ఎవరు చేస్తున్నారు? విచారణకు పిలిచినవారా? లేక విచారణకు వెళ్లినవారా? ఈ ప్రశ్నలే నేటి రాజకీయ వాతావరణానికి అద్దం పడుతున్నాయి.

> ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దావోస్ పర్యటన అంతర్జాతీయ పెట్టుబడుల పరంగా కీలకం. కానీ గత నాలుగైదు రోజులుగా మీడియా తెరలపై దావోస్ కంటే ఎక్కువగా కనిపించిన ముఖాలు కేటీఆర్, హరీష్ రావు. అభివృద్ధి కంటే ఆరోపణలే ఎక్కువ హెడ్‌లైన్స్ దక్కించుకుంటున్నాయి. ప్రభుత్వం కోరుకుంది ఇదేనా? ప్రజలను అసలు సమస్యల నుంచి దృష్టిమళ్లించే వ్యూహమా? చూడాలి.

> సత్యం రాజకీయ శబ్దంలో మునిగిపోతే న్యాయం మౌనంగా మిగిలిపోతుంది. చట్టం ముందు అందరూ సమానమే. కానీ చట్టం ముందుకు తప్పుచేసిన వారే రావాలి. చట్టమంటే భయం కలగాలి. అలాంటి పరిస్థితి ఉన్నప్పుడే విచారణలు జరగాలి. లేకపోతే చట్టం ఒక ఆయుధంగా, విచారణ ఒక వినోదంగా, న్యాయం ఒక నాటకంగా మారిపోతుంది.

కేసీఆర్ హయాంలో...ఎమ్మెల్యే కొనుగోళ్ల ఆరోపణలతో గంటల గంటల ఆడియో టేపులు విడుదలయ్యాయి. "ఇవి న్యాయమూర్తులకు పంపిస్తున్నాం" అని అధికారిక ప్రకటనలే వచ్చాయి. ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలు అప్పట్లో దేశవ్యాప్తంగా చర్చకు దారితీశాయి. అప్పుడు జరిగిన విచారణలు భయానకంగా ఉంటే, ఇప్పుడు జరుగుతున్న విచారణలు హాస్యాస్పదంగా మారాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సాక్షిగానే విచారణకు పిలిచామని ఓ మంత్రి చెబితే, కేసీఆర్ కొడుకును సాక్షిగా పిలిస్తే అసలు దోషి ఎవరు? అని కేంద్రమంత్రి బండిసంజయ్ ప్రశ్నిస్తున్నారు. గత రెండేళ్ళుగా సాగుతున్న విచారణలు, నిర్ణయాలు తీసుకోవడంలో ప్రభుత్వ గందరగోళ స్థితి అభియోగాలు ఎదుర్కొంటున్న వారే దాడిచేసే పరిస్థితిని ప్రభుత్వమే స్వయంగా కల్పిస్తున్నట్లు కనబడుతోంది. తప్పుచేయనపుడు, ఆధారాలు లేనపుడు టైంపాస్ విచారణ ఎపిసోడ్ వల్ల సమయం గడుస్తున్న కొద్దీ నష్టమే తప్ప ఏ ప్రయోజనాలు సిద్ధించవన్న అభిప్రాయాలు, విశ్లేషణలు వినపడుతున్నాయి. దీని వల్ల విచారణ చేస్తున్న వారు కూడా ఒత్తిడికి గురవుతున్న స్థితిని ప్రభుత్వమే కల్పిస్తున్నదన్న చర్చ ఉంది.

ఫోన్ ట్యాపింగ్ జరిగిందన్న అనుమానాన్ని బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ - మూడు పార్టీల నేతలు అనేక సందర్భాల్లో చెప్పారు. బీఆర్ఎస్ ముఖ్య నేతలే కాదు, ఆ పార్టీ నుంచి ఇతర పార్టీలకు మారిన నేతలూ "మేము స్వయంగా అనుభవించాం" అని చెప్పారు. కానీ ఇపుడు జరుగుతున్న నోటీసులు, విచారణల తీరు వల్ల ఆ అనుమానాలను నివృత్తి చేయడంలో విఫలమవుతోంది. మరోవైపు ఆ ఆరోపణలన్నీ ప్రజలే కొట్టివేసే వాతావరణాన్ని సిట్ విచారణల తీరు స్వయంగా కల్పిస్తున్నది. కీలక పదవుల్లో ఉన్న అధికారులపై బహిరంగంగానే ఇద్దరు మాజీ మంత్రులు తీవ్రమైన ఆరోపణలు చేస్తున్నారు. మొత్తం విచారణల తీరు, అసలు ఈ ప్రభుత్వ వ్యూహం ఏంటో పరిశీలించుకోవాల్సిన అవసరం ఉంది.

## దావోస్ కంటే దర్యాప్తే హాట్ టాపిక్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దావోస్ పర్యటన అంతర్జాతీయ పెట్టుబడుల పరంగా కీలకం. కానీ గత నాలుగైదు రోజులుగా మీడియా తెరలపై దావోస్ కంటే ఎక్కువగా కనిపించిన ముఖాలు కేటీఆర్, హరీష్ రావు. అభివృద్ధి కంటే ఆరోపణలే ఎక్కువ హెడ్‌లైన్స్ దక్కించుకుంటున్నాయి. ప్రభుత్వం కోరుకుంది ఇదేనా? ప్రజలను అసలు సమస్యల నుంచి దృష్టిమళ్లించే వ్యూహమా? చూడాల్సి ఉంది. బొగ్గు కుంభకోణం నుంచి డైవర్షన్ కోసమే ఈ కేసులు పెట్టారని బీఆర్ఎస్ ఆరోపిస్తుండగా, మీడియా సమావేశం ద్వారా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క 2014 నుండి ఇప్పటిదాకా సింగరేణి టెండర్లపై, నిర్ణయాలపై ఎలాంటి విచారణకైనా సిద్ధమని ప్రకటించారు. టెండర్ లేని చోట అవినీతి రాద్ధాంతం జరుగుతుండగా, కేంద్రం ఏకంగా దర్యాప్తు టీమ్ నే సింగరేణికి పంపింది.


## సత్యం ఎక్కడుంది?

సత్యం రాజకీయ శబ్దంలో మునిగిపోతే న్యాయం మౌనంగా మిగిలిపోతుంది. చట్టం ముందు అందరూ సమానమే. కానీ చట్టం ముందుకు తప్పుచేసిన వారే రావాలి. చట్టమంటే భయం కలగాలి. అలాంటి పరిస్థితి ఉన్నప్పుడే విచారణలు జరగాలి. లేకపోతే చట్టం ఒక ఆయుధంగా, విచారణ ఒక వినోదంగా, న్యాయం ఒక నాటకంగా మారిపోతుంది. చట్టం తాటాకంలో రాజకీయాలు రచ్చ చేస్తే... న్యాయం నది దారి తప్పుతుంది. న్యాయస్థానాల ముందు నిజం నిలబడాలి. టీవీ స్టూడియోల ముందు ఆరోపణలు కాదు. కారణాలు ఏవైనా... రాజకీయ ప్రయోజనాలు, వ్యూహాలు ఏవైనా... చట్టం అపహాస్యం కాకుండా కాపాడటం ప్రభుత్వం, ప్రతిపక్షం, అధికారులు - అందరి బాధ్యత. సత్యమేవ జయతే

# రథసప్తమి విశిష్టత

## శక్తికేంద్రంగా సూర్యభగవానుడు

రథసప్తమి రోజున సూర్యభగవానుడు ఏడు గుర్రాల రథంపై దర్శనమిస్తాడని, ఈ పర్వదినాన సూర్యుడిని ఆరాధించడం వల్ల మృత్యుభయం పోయి సూర్యలోక ప్రాప్తి కలుగుతుందని పండితులు చెబుతున్నారు. సూర్యుడు చీకట్లను తొలగించి.. సమస్త లోకాలకు వెలుగులు పంచేవాడు సూర్య భగవానుడు. ఉదయం బ్రహ్మ దేవుడిగా.. మధ్యాహ్నం మహేశ్వరుడిగా.. సాయంకాలం విష్ణువుగా.. తెల్లటి ఏడు గుర్రాల రథంపై శ్వేతపద్మాన్ని ధరించి దర్శనమిచ్చే భగవానుడు సూర్యుడు. అదితి కశ్యపుల సంతానంగా మాఘమాసంలో శుక్లపక్ష సప్తమిని సూర్యుడు అవతరించాడని పండితులు చెబుతున్నారు. హిందువులు ఆరోజున సూర్యుడిని ఆరాధిస్తుంటారు. ఆ రోజున ఆకాశం మొత్తం రథాకారంలో కనిపిస్తుందని పండితులు చెబుతున్నారు. రథసప్తమి రోజు పుణ్యకార్యములు తలపెట్టిన విజయవంతగా పూర్తి అవుతాయని నమ్మకం. సూర్యుడు తన రథం దిశను మార్చుకునే రోజు.. మాఘమాసం శుక్లపక్షం సప్తమి తిథి రోజు. సూర్యుడు అనంతమైన కాలానికి అధిపతి. విశ్వానికి చైతన్యాన్ని ప్రసాదించేవాడు. సూర్యుడిని భాస్కరుడు అని కూడా అంటారు. భాసం... అంటే ప్రకాశం. కరుడు.. అంటే చేసేవాడు. భాస్కరుడు.. అంటే జగత్తును ప్రకాశవంతం చేసేవాడు అని అర్థం. సూర్యభగవానుని ప్రేరణతోనే సమస్త జీవరాశులు పగటివేళ వాటి విధుల్లోనూ, రాత్రివేళలో నిద్రపోతూ విశ్రాంతి తీసుకుంటాయి. పురాణాల ప్రకారం సూర్య భగవానుడికి శక్తి కేంద్రంగా భావిస్తారు. పాఠ్యపుస్తకాలలో సూర్యశక్తి గురించి కూడా సైంటిఫిక్ గా వివరించారు. ప్రపంచానికి వెలుగునిచ్చే సూర్యునికి ఎంతో శక్తిఉందని.. నవగ్రహాలకు అధిపతి అయిన సూర్యుడు అనేక వ్యాధులను దూరం చేసుకొనేవాడిగా.. వృద్ధాప్యంలోనూ.. ఆరోగ్యానికి ప్రసాదించే వానిగా భావిస్తారు. సూర్యుడిని ఆరోగ్యప్రదాతగా కొలుస్తుంటారు. రథసప్తమి రోజున ప్రాతఃకాల సమయాన గంగలో స్నానాలు, సూర్యోపాసనల వలన మృత్యుభయం పోతుందని నమ్ముతుంటారు. మరణించిన తర్వాత సూర్యలోకానికి వెళతారని పండితులు అంటుంటారు. ఆ రోజున నదీ తీరాలలో నెయ్యి లేదా నూనెతో ప్రమిదలో దీపాన్ని వెలిగించి.. నీటిలో వదలాలి. ఆ తర్వాత మగవాళ్లు తలమీద 7 జిల్లేడు ఆకులను, ఆడవారు 7 చిక్కుడు ఆకులను ఉంచుకుని స్నానం చేసి నీళ్ళలో నవధాన్యాలు, ధాన్యం, నువ్వులు, అక్షింతలు, చందనం కలిపుకొని స్నానం చేయాలి. రథ సప్తమిరోజున ఆవు నేతితో దీపారాధన చెయడం వల ఆ ఇంటిలో అష్ట ఐశ్వర్యాలు, ఆయురారోగ్యాలు కలుగుతాయని పండితులు చెపుతారు. రథసప్తమి రోజు సూర్యకిరణాలు పడే చోట తూర్పు దిక్కున తులసికోట పక్కగా ఆవు పేడతో అలికి, దానిపై పిండితో పద్మం వేసి, పొయ్యి పెట్టి, సంకాంత్రి రోజున పెట్టిన పిడకలు, గొబ్బెమ్మలతో పోయ్యి వెలిగించి దాని మీద పాలు పొంగిస్తారు. తరువాత ఆ పాలల్లో కొత్తబియ్యం, బెల్లం, నెయ్యి, ఏలకులు వేసి పరమాన్నం తయారు చేస్తారు. తులసికోట ఎదురుగా చిక్కుడు కాయలతో రథం చేసి చిక్కుడాకులపై పరమాన్నం ఉంచి దేవుడికి నైవేద్యం సమర్పిస్తారు. రథసప్తమి నాడు దేవుడికి ఎరుపు రంగు పూలతో పూజిస్తే మంచిది. రథ సప్తమి రోజు ఉపవాసము ఉండి దైవారాధనలోనే కాలం గడిపితే ప్రత్యక్ష దైవం సూర్యభగవానుని అనుగ్రహం పొందుతారని పురాణాలు తెలిపాయి. ఈ రోజున ముత్తయిదువులు తమ నోములకు, వ్రతాలకు అంకురార్పణ చేస్తారు. ఇందులో చిత్రగుప్తుని నోము, ఉదయకుంకుమ నోము , పదహారఫలాల నోము, గ్రామకుంకుమ నోములను రథ సప్తమి రోజున ప్రారంభిస్తారు.




రచనలకు ఆహ్వానం
ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp:
74369 39999

## రేడియల్ సర్వేకు అడుగడుగున
# అడ్డుకుంటున్న రైతులు...

### అయినా ఆగని రేడియల్ రోడ్ సర్వే....



**రాజేంద్రనగర్ మహా ;** రేడియల్ రోడ్ సర్వేపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత నాలుగు రోజుల నుంచి శంషాబాద్ లో రేడియల్ రోడ్ లొల్లి మొదలైంది. రెవెన్యూ అధికారులు రైతులను సంబంధిత భూ యజమాలను సంప్రదించకుండా ఇష్టానుసారంగా నిర్ణయం తీసుకొని రేడియల్ రోడ్డు సర్వే చేస్తున్నారు. తమ భూములు రేడియల్ రోడ్డుకు అప్పగించాలనే నెపంతోనే కావాలనే రెవెన్యూ అధికారులు రైతులపై కక్షగట్టి రైతుల భూములను లాక్కుంటున్నారని వాపోయారు. తమ భూములు పోతున్న తమని సంప్రదించకుండా సర్వేలు చేస్తున్నారని రైతులు రెవెన్యూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శంషాబాద్ మండలంలోని నర్కుడా గ్రామ రెవెన్యూ పరిధిలోని సగృహ వెంచర్ లో శనివారం రెవెన్యూ అధికారులు రేడియల్ సర్వే నిర్వహించారు. రేడియల్ సర్వేకు అడుగడుగున రైతులు అడ్డంకి కలిగించారు. అయినా రెవెన్యూ అధికారులు పట్టించుకోకుండా సర్వే ని పూర్తి చేస్తున్నారు. స్థానిక రైతులు, సొసైటీ మాజీ చైర్మన్ బుర్కుంటా సతీష్, బిఆర్ఎస్ నాయకులు, బిజెపి నాయకులతో కలిసి సర్వే ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. రెవెన్యూ అధికారులు అడ్డు తగిలిన ఆగకుండా సర్వే ని పూర్తి చేసే ప్రయత్నం చేస్తున్నారు. సొసైటీ చైర్మన్ సతీష్ మాట్లాడుతూ ఆల్రెడీ ఒక రోడ్డు ఉండంగా మరో రేడియల్ రోడ్డు అవసరమాన్నారు. ప్రభుత్వం షాబాద్ రోడ్ ని ఇంకొంచెం పెంచుకోని వాడుకోవాలి తప్ప ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొడంగల్ ప్రజల మెప్పు స్వప్రయోజనం కోసం ఎవరికి ఉపయోగపడని రేడియల్ రోడ్డును నిర్మాణం చేపట్టారు. ఆరోడ్డు నిర్మాణంలో రైతుల పొలాలతో పాటు డబ్బులు పెట్టుకుని ప్లాట్లు కొనుక్కున్న వారి పరిస్థితి ఆగమ్య గోచరంగా మారిందన్నారు. కోట్లు విలువచేసే భూములు చూస్తూ చూస్తూ రోడ్డు కోసం ఎకరా అర్దేకర పోతున్న రైతులకు సంతృప్తికరంగా నష్టపరిహారం అందట్లేదన్నారు. ఎకరాలు పోతున్న రైతులకు ఒక గుంటకు రావాల్సిన డబ్బులు వస్తున్నాయని ఎద్దేవా చేశారు. రైతును బాధపెట్టిన రాజ్యం బాగు పడినట్లు చరిత్రలో లేదని మాజీ చైర్మన్ సతీష్ మండిపడ్డారు. ఆడబిడ్డల పెళ్లిల కోసం రూపాయి రూపాయి దాచిపెట్టుకొని సుదూర ప్రాంతాల నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం పరిసర ప్రాంతాల్లో ప్లాట్లు కొనుగోలు చేశారు. వారి పరిస్థితి రేవంత్ రెడ్డికి తెలుసా అని ప్రశ్నించారు.

**రైతుల ఆందోళన..**

మజీద్ పటేల్.. తాతల కాలం నుంచి రెండు ఎకరాలపైనే ఆశ పెట్టుకున్నాము. అందరు అమ్ముకున్న తాము భూమిని నమ్ముకున్నామన్నారు. ఉన్న కాస్త రెండు ఎకరాలు ప్రభుత్వం రేడియల్ రోడ్డుతో మా కుటుంబలు రోడ్డున పడ్డాయన్నారు.

చావనైనా చస్తాము కానీ మా భూమిని వదులుకోమన్నారు. ప్రభుత్వం రేవంత్ రెడ్డి తమపై దయవుంచి రేడియల్ రోడ్ ప్రాజెక్టును విరమించుకోవాలని రైతులు ప్రాధేయపడ్డారు. కార్యక్రమంలో పలువురు రైతులు నాగమల్లి శేఖర్ యాదవ్, పోశయ్య, పాండు గౌడ్, నాన్న వాళ్ళ కుమార్ యాదవ్, మహేష్, పలు పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారులు పేర్లు నమోదు చేసుకోవాలి..

### ఎంపీడీవో సంధ్య



**మొయినాబాద్ మహా:** సీఎం కప్ క్రీడా పోటీల్లో యువత పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఎంపీడీవో సంధ్య తెలిపారు. శనివారం మండల పరిషత్ అభివృద్ధి అధికారిని సంధ్య అధ్యక్షతన.. సీఎం కప్ క్రీడా పోటీల నిర్వహణకు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల పంచాయితీ అధికారి వెంకటేశ్వర్ రెడ్డి, మండల విద్యాధికారి మల్లయ్య, మొయినాబాద్ ఎస్సై జబీనా బేగం, వివిధ పాఠశాలలకు సంబంధించిన వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సంధ్య మాట్లాడుతూ.. క్రీడాకారులు క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు తమ పేర్లను నమోదు చేసుకోవాలని క్రీడాకారులకు సూచించారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని చిల్కూర్ లోని రెసిడెన్షియల్ మైదానంలో ఈనెల 29, 30 తేదీలలో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సంధ్య తెలిపారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, రన్నింగ్, షార్ట్ పుట్, లాంగ్ జంప్, నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తమ పేర్లను ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోకపోయినా క్రీడాకారులు మైదానంలో క్రీడా పోటీల్లో పాల్గొన్నవచ్చునని, ఎంపీడీవో సంధ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## షాద్ నగర్ పట్టణంలో కాంగ్రెస్ భారీ ర్యాలీ

- వేలాదిగా తరలివచ్చిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు
- జానపద గీతాలు డప్పుల మోతతో అదరగొట్టిన ర్యాలీ



**షాద్ నగర్. మహా,** షాద్ నగర్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ జన ప్రభంజనం పేరుతో శనివారం చౌడమ్మ గుట్ట నుండి భారీ ర్యాలీని ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి శ్యాంసుందర్ రెడ్డి తదితర పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాదయాత్రగా బయలుదేరి పట్టణంలో చౌరస్తా మీదుగా మెయిన్ రోడ్డు, పటేల్ రోడ్డు, పరమేశ్వర థియేటర్ రోడ్, ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ మీదగా, ఫరూక్ నగర్, నాగులపల్లి రోడ్డు, పరిగి రోడ్ ఇంకా అనేక ముఖ్యమైన ప్రాంతాల్లో ర్యాలీగా బయలుదేరారు. జానపద కళాకారుల డప్పుమోతలు నృత్యాలతో అలరించారు. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి శ్యాంసుందర్ రెడ్డి, తాండ్ర కాశీనాథ్ రెడ్డి, శివశంకర్ గౌడ్, తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు శ్రావణి, సర్వర్ పాషా, మొహమ్మద్ బాబర్ అలీ ఖాన్ చెంది తిరుపతి రెడ్డి, రఘు నాయక్, జంగారీ రవి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు శివారెడ్డి, రవీందర్ రెడ్డి, గోటిక గోపాల్ రెడ్డి, జమ్రుద్ ఖాన్, అప్పి, చందు రాథోడ్, పట్టణానికి చెందిన 28 వార్డులకు సంబంధించిన ఆశావాహులు అదేవిధంగా నియోజకవర్గంలోని ఆయా గ్రామాలకు చెందిన సర్పంచులు ఉపసర్పంచులు వార్డు సభ్యులు కాంగ్రెస్ పార్టీ వివిధ విభాగాల శ్రేణులు, మహిళ నాయకురాళ్లు పెద్ద ఎత్తున ర్యాలీకి హాజరయ్యారు. ఎమ్మెల్యే శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి, ఇరువురు రోడ్డుకు ఇరువైపులా ప్రజలకు అభివాదం చేస్తూ వ్యాపారస్తులను చేతిలో చేయి వేసి నమస్కరిస్తూ ప్రతి చోట తన జన ప్రపంచాన్ని పరిచయం చేస్తూ జనాలకు ముందుకు సాగారు.

## బాలిక సాధికారతతోనే నవసమాజ నిర్మాణం

### సూర్యాపేట జిల్లా సంక్షేమ అధికారి నర్సింహారావు



**సూర్యాపేట జిల్లా మహా:** సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం లో మహిళా శిశు సంక్షేమ శాఖలోని జిల్లా మహిళా సాధికారత కేంద్రం వారి ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా సంక్షేమ అధికారి నర్సింహారావు గారు మాట్లాడుతూ బాలికలు ఆకాశమే హద్దుగా ఎదగాలి బాల్య వివాహాలు అనేవి బాలికల ఎదుగుదలకు శాపాలు అన్నారు ప్రతి అమ్మాయి తన హక్కుల పట్ల అవగాహన ఉండాలన్నారు అదే విధంగా బేటీ బచావో బేటీ పఢావో' నినాదాన్ని ప్రతి ఒక్కరూ గ్రామంలోనూ ఇంటింటికి తీసుకెళ్లాలన్నారు, బాలికల చదువుతోనే వారి భవిష్యత్ వికసిస్తుంది అని అన్నారు,అదేవిధంగా బాల్య వివాహాలు లేని జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు సమాజంలో బాలికల పట్ల ఉన్న వివక్షను రూపుమాపి, వారికి సమాన అవకాశాలు కల్పించాల్సిన ఆవశ్యకతను ఈ వేదిక ద్వారా చాటిచెప్పారు. అదేవిధంగా జిల్లా వైద్యాధికారి వెంకటరమణ మాట్లాడుతూ బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం. ముఖ్యంగా కౌమార దశలో ఎదురయ్యే శారీరక మార్పులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు పై వివరించారు. పౌష్టికాహారం పట్ల అవగాహన కలిగి ఉండాలి. రక్తహీనత వంటి సమస్యలు రాకుండా జాగ్రత్త పడాలి అన్నారు అదేవిధంగా బాలికల ఆరోగ్యం కోసం వారి శాఖ అందించే సేవలను వివరించారు అదేవిధంగా ఆడపిల్లలను గర్భంలోనే చంపకుండా గర్భస్థ లింగ నిర్ధారణ నివారణ పీసీపీఎన్డీటీ యాక్ట్ గురించి తెలియచేయడం జరిగింది. సి డబ్ల్యూ సి చైర్మన్ రమణారావు బాలికల రక్షణ కోసం ప్రభుత్వం అనేక చట్టాలను తీసుకువచ్చింది. ఏదైనా ఆపద కలిగితే భయం వీడి 1098 చైల్డ్ లైన్ సఖి కేంద్రాన్ని ఆశ్రయించాలి. చట్టం ఎల్లప్పుడూ మీ వెంటే ఉంటుంది అన్నారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థినులు నృత్యాలు స్కిట్ తో అలరించారు జిల్లా బాలల పరిరక్షణ అధికారి (డిసిపిఓ) రవి కుమార్ , మహిళా సాధికారత కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ చైతన్య , సఖి కేంద్రం సి ఎ హేమలత , పాఠశాల స్పెషల్ ఆఫీసర్ (ఎస్ ఓ) ఆసియా జబిన్, ఎయిడ్ ఎన్జీవో ఒగ్గు సోమన్న పెన్ పహాడ్ పీహెచ్ సీ డాక్టర్ రాజేష్, సి డబ్ల్యూ సి సభ్యులు, చైల్డ్ లైన్ సిబ్బంది, సఖి కేంద్రం సిబ్బంది, డి హెచ్ ఈ డబ్ల్యూ సిబ్బంది, మెడికల్ ఆఫీసర్లు, పాఠశాల సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# మంచికి ఓటెయ్యండి, ధర్మాన్ని గెలిపించండి

### షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**షాద్ నగర్. మహా:** షాద్ నగర్ పట్టణంలోని ఈడెన్ ప్లాజా ఫంక్షన్ హాల్ లో కాంగ్రెస్ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. గత రెండేళ్ల నా పాలనలో ప్రజలను ఎంతో ఇష్టంగా చూసుకున్నాను. అవినీతి అక్రమాలకు పాల్పడలేదు. ఎవరి వద్ద డబ్బులు వసూళ్లు చేయలేదు.. మున్సిపాలిటీ అడ్డం పెట్టుకొని సామాన్యుల ఇండ్లు కూల్చలేదు. శత్రువు కైనా సరే సహాయం చేశాను. ఇది కాంగ్రెస్ పద్ధతి.. ఈనాడు పద్ధతి తప్పిన పనులు చేయలేదు గత పాలకుల మాదిరిగా ఎవరిని దోచుకోలేదు.. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో మంచికి ఓటెయ్యండి ధర్మాన్ని గెలిపించండి. గత పదివేల పాలనకు తన రెండేళ్ల పాలనకు వ్యత్యాసం ఏమిటో ప్రజలే గ్రహిస్తున్నారని అన్నారు. అందరి కొట్లాటనే తన కొట్లాట అని ఎవరిపై రాజకీయ విద్వేషాలు లేవని సంక్షేమం అభివృద్ధి చేయాలని కసి పట్టుదల ప్రజలను చూసి తనలో వచ్చిందని అన్నారు. రెండేళ్లలో 1350 కోట్ల రూపాయలను అభివృద్ధి నిధులు తీసుకువచ్చి నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తున్నానని అన్నారు. అభివృద్ధికి తాను కంకణ బద్ధుడై ఉన్నానని అన్నారు. గత పాలనలో ఓల్డ్ హైవే రోడ్డుపై వరినట్లు వేసిన ఘటనను ఆయన గుర్తు చేసుకున్నారు. ఈరోజు నియోజకవర్గంలో రోడ్లు ఎలా ఉన్నాయో ప్రజలే చెబుతారని అన్నారు. మొదటి విడతగా మున్సిపాలిటీలో 88 కోట్లు, రెండవ దఫా 18 కోట్లు, మూడవ దశ దాదాపు 25 కోట్ల వరకు నిధులు తీసుకువచ్చినట్లు గుర్తు చేశారు. మరో 80 కోట్ల వరకు వీలైతే నిధులు సాధిస్తానని అభివృద్ధి చేస్తానని స్పష్టం చేశారు.

**నిరంతరం ప్రజలలో ఉన్న వారికి టికెట్లు**

పట్టణంలో నిరంతరం ప్రజలతో మమేకమై ప్రజా సేవ చేసిన వారికి ప్రజల్లో గుర్తింపు బాగా ఉన్నవారికి కాంగ్రెస్ పార్టీ సెలక్షన్ కమిటీ ఎంపిక చేస్తుందని అన్నారు. టికెట్ల ఎంపికలో తన ప్రమేయం ఏమీ ఉండబోదని అన్నారు. అన్ని వార్డుల్లో కమిటీలు వేశామని అదేవిధంగా ప్రత్యేక సర్వేలు కూడా జరుగుతున్నాయని వాటి ఆధారంగానే ప్రజలు గుర్తించిన నాయకుడికి కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇస్తుందని అన్నారు. టికెట్ రానివారు ఎలాంటి బాధపడాల్సిన అవసరం లేదని వారికి పార్టీ పదవులు లేదా ప్రభుత్వంలో నామినేటెడ్ పదవులు త్వరలోనే వరిస్తాయని వాటికి ఎంపిక చేస్తామని స్పష్టం చేశారు. సెలక్షన్ కమిటీ చేసిన సిఫార్సు మేరకు టికెట్లు వరిస్తాయని ఎవరి జోక్యం ప్రమేయం ఉండబోదని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, తాండ్ర కాశీనాథ్ రెడ్డి, అగ్గనూరు విశ్వం విశాల మహమ్మద్ అలీ ఖాన్ బాబర్ కృష్ణారెడ్డి శ్రీకాంత్ రెడ్డి మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, సర్వర్ పాషా దామోదర్ రెడ్డి గంద్రతి బాలరాజ్ గౌడ్ జంగా నరసింహా యాదవ్ అంగనూరు బస్వం రఘునాయక్ పురుషోత్తం రెడ్డి చంద్రశేఖర్ నలమూని శ్రీధర్ మనీష్ జితేందర్ రెడ్డి అందేమోహన్ దిలీప్ నాగరాజు శ్రావణి వర్మ అసద్ ముఫ్తార్ అలీ, ముబారక్ అలీ ఖాన్, సయ్యద్ ఖదీర్, జంగారి రవి, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షులు కొమ్ము కృష్ణ, రాయకల్ శ్రీనివాస్, ఉప సర్పంచ్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.



## అదనపు కలెక్టర్ భాస్కరరావు కు
# శుభాకాంక్షలు

### వలిగొండ ఎంపీడీవో జలంధర్ రెడ్డి

**వలిగొండ, మహా :** అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) భాస్కరరావు ఐఏఎస్ ఖరారైన సందర్భంగా( వలిగొండ మండల అభివృద్ధి అధికారి జలంధర్ రెడ్డి శనివారం ఐఏఎస్ భాస్కరరావు కు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలుపుతూ అభినందించారు ఐఏఎస్ భాస్కరరావు మరెన్నో ఉన్నత పదవులో సేవలందించాలనిఆకాంక్షించారు




## జనవరి 26న రైతు, కార్మికుల సమస్యలపై
# మోటార్ సైకిల్ ర్యాలీ

**సూర్యాపేట జిల్లా మహా:** విత్తన చట్టం ను,విద్యుత్ బిల్లు ను,వి బి జీ రామ్ జీ పథకం ని 4 లేబర్ కోడ్ లను తక్షణమే రద్దు చేయాలని జనవరి 26న మోటార్ సైకిల్ ద్వారా నిరసన ర్యాలీ నిర్వహించాలని స్థానిక ధర్మ బిక్షం భవన్లో తెలంగాణ రాష్ట్రరైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కంబాల శ్రీనివాస్ తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మల్లు నాగార్జున రెడ్డి అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మందారి డేవిడ్ కుమార్ ఏఐకేఎఫ్ రాష్ట్ర నాయకులు వరికుప్పల వెంకన్నలతో జరిగిన సమావేశం లో నిర్ణయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక రంగాల సమస్యలు రోజురోజుకు తీవ్రమవుతున్నాయని వీటిని పరిష్కరించడంలో పాలకులు విఫలం చెందారన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అప్పులు ఆత్మహత్యలు ఆగడం లేదని వీటికి కారణం ప్రభుత్వ ద్వంద విధానాలు అన్నారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం కార్మికుల సమస్యల పరిష్కారం కోసం దేశ వ్యాప్తంగా ఎస్ కే యం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు కొనసాగుతున్నాయి అన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు మరచి నల్ల చట్టాలను దొడ్డి దారిన తీసుకురావడానికి తీవ్రంగా ప్రయత్నం చేస్తుందన్నారు. రైతు కార్మిక వ్యతిరేక విధానాల నిరసిస్తూ జనవరి 26న జరిగే మోటార్ సైకిల్ ర్యాలీలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డు శంకర్ ఏఐకేఎఫ్ రాష్ట్ర నాయకుడు ఎస్కే నజీర్ సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కోట గోపి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నరసయ్య శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## జాన్ పహాడ్ దర్గా సర్వ మత సమ్మేళ్యానికి ప్రతీక

### జాన్ పహాడ్ దర్గాను దర్శించుకొని, సైదులు బాబుకు భక్తి శ్రద్ధలతో చాదర్,దట్టినీ కప్పిన మంత్రి మహమ్మద్ అజారుద్దీన్



**హుజూర్ నగర్ మహా:** జాన పహాడ్ దర్గా సర్వ మత సమ్మేళ్యానికి ప్రతీక అని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ, పబ్లిక్ ఎంటర్ ప్రైజస్ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ అన్నారు. సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం జాన్ పహాడ్ దర్గాను మంత్రి శనివారం దర్శించుకున్నారు.అనంతరం మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ శుక్రవారం ఉర్స్ జరిగింది, శనివారం ఆయన జియారత్ (దర్శనం) కోసం వచ్చానని ఇక్కడ ఉండటం నాకు చాలా సంతోషంగా ఉంది. ఇక్కడికి అన్ని వర్గాల ప్రజలు వస్తారని హిందూ, ముస్లిం, సిక్కు, క్రైస్తవ... అందరూ ఇక్కడికి వచ్చి తమ మొక్కులు తీర్చుకుని వెళ్తుంటారని తెలిపారు. మీ అందరి మధ్యకు రావడం నాకు చాలా సంతోషాన్ని ఇచ్చిందని అల్లా దయవల్ల అవకాశం దొరికితే మళ్ళీ వస్తానని, నేను కోరుకునేది ఒక్కటేనని మీరందరూ ఇక్కడ కలిసి మెలిసి ఉండాలని మంచి పనులు చేయాలని అన్ని వర్గాలు కలిసి ఉంటేనే పని బాగా జరుగుతుందని ఇక్కడికి బయటి నుంచి కూడా చాలా మంది వస్తుంటారని ఇది చాలా పెద్ద దర్గా షరీఫ్, ఇక్కడ గొప్ప మహనీయులు (బుజుర్గాన్‌ఏదీన్) కొలువై ఉన్నారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చిన వారందరికీ శుభాకాంక్షలు తెలిపినారు ఈ ఉర్స్ ప్రతి ఏటా చాలా బాగా జరుగుతుంది, ఇన్షా అల్లాహ్ వచ్చే ఏడాది కూడా ఇంకా బాగా జరుగుతుందని ఆశిస్తున్నానని అన్నారు.ఈ కార్యక్రమానికి ఆర్ డి ఓ శ్రీనివాసులు, డి ఎస్ పి ప్రసన్న కుమార్, మైనార్టీ సంక్షేమ అధికారి నరసింహ రావు,తహసీల్దార్ కమలాకర్,వక్స్ బోర్డు ఇన్స్పెక్టర్ మహబూబ్, ముజవర్ జానీ బాబా, ప్రజా ప్రతినిధులు, అధికారులు, తదితరులు హాజరైనారు.

## బానోత్ చంద్రు నాయక్ పార్థివ దేహానికి పూలమాలలు వేసే
# నివాళులర్పించిన 18వ వార్డు నాయకులు



**హుజూర్ నగర్ మహా:** హుజూర్ నగర్ పట్టణంలోని 18 వ వార్డుకు చెందిన బానోత్ చంద్రు నాయక్ శనివారం అకాల మరణం చెందగా వారి యొక్క ఆత్మకు శాంతి చేకూరాలని బానోతు చంద్రు నాయక్ పార్థివ దేహానికి హుజూర్ నగర్ నియోజకవర్గ మైనార్టీ ప్రెసిడెంట్ షేక్ సైదా, 19వ వార్డు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వల్లపుదాసు కృష్ణ గౌడ్ మాజీ కౌన్సిలర్ తేజావత్ రవి నాయక్, సోమ్లా నాయక్ జాల ప్రశాంత్ బానోతు రమ్య లతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి యొక్క కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## మున్సిపల్ ఓటర్ల జాబితాపై
# హైకోర్టు మధ్యంతర ఆదేశాలు




**సూర్యాపేట జిల్లా మహా:** సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో విడుదల చేసిన తుది ఓటర్ల జాబితాలో లోపాలున్నాయంటూ దాఖలైన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు కీలక మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. ఓటర్ల జాబితాలో కుల రిజర్వేషన్, వార్డు వారీ కేటాయింపుల్లో వ్యత్యాసాలు ఉన్నాయని,డూప్లికేట్ ఓట్లు, మరణించిన వ్యక్తుల పేర్లు తొలగించలేదని ఆరోపిస్తూ సూర్యాపేటకు చెందిన డి.శివప్రసాద్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బి. విజయసేన్ రెడ్డి శుక్రవారం విచారణ చేపట్టారు.పిటిషనర్ తరఫున న్యాయవాది ఆర్. శ్రీధర్ వాదనలు వినిపించగా, ప్రభుత్వం, ఎన్నికల సంఘం, మున్సిపల్ అధికారుల తరఫున సంబంధిత న్యాయవాదులు వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా కోర్టు స్పందిస్తూ, పిటిషనర్ 19 జనవరి 2026 న ఇచ్చిన అభ్యంతరాలను జిల్లా కలెక్టర్ పరిశీలించాలని ఆదేశించింది. కుల రిజర్వేషన్, వార్డు వారీ రిజర్వేషన్ కేటాయింపుల్లో ఉన్న లోపాలపై పిటిషనర్‌కు వాదించే అవకాశం కల్పించి, చట్టప్రకారం నిర్ణయం తీసుకోవాలని కలెక్టర్‌కు స్పష్టం చేసింది. హైకోర్టు ఆదేశాల ప్రకారం ఈ ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా, అత్యవసరంగా పూర్తి చేయాలని, ముఖ్యంగా ఆదేశాల ప్రతిని స్వీకరించిన తేదీ నుంచి ఏడు రోజుల్లోపు తగిన ఉత్తర్వులు జారీ చేయాలని పేర్కొంది. ఈ వ్యవహారాన్ని ఫిబ్రవరి 20, 2026న మళ్లీ విచారణకు లిస్టు చేసింది.

## పెళ్లిరోజు సందర్భంగా జిప్సీ అనాథాశ్రమానికి బియ్యం పంపిణీ చేసిన అడ్వకేట్ గోపాల కృష్ణమూర్తి-జగన్మోహిని

**హుజూర్ నగర్ మహా:** హుజూర్ నగర్ పట్టణానికి చెందిన అడ్వకేట్ ఉప్పాల గోపాలకృష్ణమూర్తి జగన్మోహిని ల పెళ్లిరోజు సందర్భంగా పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో ఉన్న జిప్సీ అనాథ శరణాలయంలో 25 కిలోల బియ్యం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లల మధ్య వేడుక జరుపుకోవడం సంతోషకరంగా ఉందన్నారు.ఎంతోమంది పిల్లలను చేరదీసి ఆశ్రయం కల్పిస్తున్న జిప్సీ అనాథ శరణాలయం ను సిబ్బందిని ఈ సందర్భంగా అభినందించారు.అనాథ పిల్లలకు తన వంతు సహాయ సహకారాలుఎల్లవేళలా ఉంటాయన్నారు.ఈ కార్యక్రమంలో హోమ్ వార్డెన్ ధన్ పాల్,చిన్ని మరియు తదితరులు పాల్గొన్నారు.





## విద్యార్థులు పోటీతత్వంతో చదవాలి

**ఆమనగల్లు, మహా:** విద్యార్థులకు వసతి గృహాల్లో మెరుగైన వసతులు కల్పించి నాణ్యమైన విద్యనందించాలని ఎంపిడిఓ కుసుమ మాధురి అన్నారు. శనివారం జెడ్పిహెచ్ఎస్ బాలికల పాఠశాల బాలికల దినోత్సవం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ పాల్గొని విద్యార్థుల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడి, వారికి పెడుతున్న ఆహార పదార్థాలను తనిఖీ చేసి, మెనూ అమలు చేస్తున్నారో లేదో కనుక్కున్నారు.ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతు విద్యార్థులు పోటీతత్వంతో చదవడం ద్వారా నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకుంటారన్నారు.ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల కష్టాలను దృష్టిలో పెట్టుకొని పట్టుదలతో చదువలన్నారు. ఈ కార్యక్రమం లో జిహెచ్ఎం రామలక్ష్మి, ఎంఈఓ పాండు, డిటి వినోద్, స్కూల్ ఎచ్ ఎం లు పాల్గొన్నారు.

## జిల్లా వ్యాప్తంగా 16వ జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకలు

### జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** నేడు జిల్లా వ్యాప్తంగా 16వ జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి తెలిపారు. భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నేడు ఆదివారం (జనవరి 25, ఆదివారం) జిల్లా వ్యాప్తంగా 16వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం జిల్లా కేంద్రంతో పాటు, అన్ని అసెంబ్లీ నియోజక వర్గ కేంద్రాలు, మండల కార్యాలయాలు మరియు పోలింగ్ బూత్ స్థాయిలో నిర్వహించబడుతుందని ఆయన పేర్కొన్నారు.

## రిపబ్లిక్ డే వేడుకలలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఫోటో పెట్టాలి

### సంగిశెట్టి క్రిస్టఫర్, సామాజిక కార్యకర్త

**వలిగొండ, మహా:** రిపబ్లిక్ డే వేడుకలలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఫోటో పెట్టాలని సామాజిక కార్యకర్త మలిదశ ఉద్యమకారుడు సంగిశెట్టి క్రిస్టఫర్ అన్నారు శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయం జరిగినప్పుడే అందరికీ సమాన అవకాశాలు దక్కుతాయని భావించిన వ్యక్తి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని పేర్కొన్నారు.. సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్రం రాజ్యాన్ని నిర్మించాలని రెండు సంవత్సరాల 11 నెలల 18 రోజులపాటు శ్రమించి, ఎన్నో నిద్రలేని రోజులు గడిపి భారత రాజ్యాంగాన్ని లిఖించారని, తాను రాసిన రాజ్యాంగ రచనలను 1949 నవంబర్ 26న సమర్పించారని, 1950 జనవరి 26న రాజ్యాంగాన్ని అమలులోకి తెచ్చిన రోజు కాబట్టి రిపబ్లిక్ డే జరుపుకుంటున్నామని తెలిపారు.. కానీ ప్రస్తుతం అంబేద్కర్ చేసిన సేవలను స్మరించుకోకుండా, రిపబ్లిక్ డే సందర్భంగా కనీసం ఆయన ఫోటోను కూడా పెట్టకుండా మర్చిపోతున్నారని మండిపడ్డారు.. రిపబ్లిక్ డే సందర్భంగా అన్ని జిల్లాల కలెక్టర్లకు ప్రత్యేక జీవో జారీ చేసి గణతంత్ర దినోత్సవ వేడుకల్లో అంబేద్కర్ ఫోటో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు..



## రానున్నమున్సిపల్ ఎన్నికలను సజావుగా నిర్వహించేలా ఆర్వోలు, ఏఆర్వోలు
# సహకరించాలి

### జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట జిల్లా మహా:** సూర్యాపేట జిల్లా సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లాలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు నియమించబడిన ఆర్వోలు, ఏఆర్ఓ లకు ఉద్దేశించి శనివారం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఎన్నికలకు నియమించబడిన ప్రతి ఒక్కరు విధులు నిర్వహించాలని అన్నారు. ఎన్నికల నియమ, నిబంధనల ప్రకారం హ్యాండ్ బుక్ ఆధారంతో ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా చదువుకొని తప్పులు లేకుండా సక్రమంగా విధులు నిర్వహించాలన్నారు.ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన వెంటనే నామినేషన్ల స్వీకరణ నుండి పోలింగ్,కౌంటింగ్ పూర్తి అయ్యే వరకు అన్ని అంశాల పట్ల ముందే సంసిద్ధం కావాలని ఇందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేసుకోవాలని చెప్పారు.ఇట్టి సమావేశమునకు అదనపు కలెక్టర్ కే సీతారామారావు, జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు,ట్రైనర్లు రమేష్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ANN

HEALTH & BUSINESS AWARDS-2026

ANN Telugu & Mahaa Daily Presents

# HEALTH & BUSINESS ICON AWARDS 2026

February 2026



# ప్రభాస్ సీక్వెల్ అదిరిపోతుంది..

ప్రభాస్ అభిమానులను 'ది రాజాసాబ్' కాస్త నిరాశపరిచింది. అయినప్పటికీ డార్లింగ్ ఇమేజ్‌కు ఎలాంటి ఇబ్బంది లేదు. ఈ మూవీ తర్వాత ఆయన నుంచి ఫౌజీ, స్పిరిట్, సినిమాలు తెరపైకి రానున్నాయి. ఈ రెండూ ఇప్పుడు షూటింగ్ దశలో ఉన్న సంగతి తెలిసిందే. అయితే, అతి త్వరలోనే 'కల్కి 2' కూడా మొదలు కానుంది. ఇదే విషయాన్ని సంగీత దర్శకుడు సంతోష్ నారాయణన్ తెలిపారు. 'కల్కి 2898ఏడీ'కి కొనసాగింపుగా దర్శకుడు నాగ్ అశ్విన్ తెరకెక్కించనున్నారు. కల్కి2 గురించి సంగీత దర్శకుడు సంతోష్ నారాయణన్ ఇలా అన్నారు. 'కల్కి -2 నా కెరీర్‌లోనే టాప్ సినిమాగా ఉండబోతుంది. ఈ మూవీ కోసం నేను అందించబోయే సంగీతం చాలా అద్భుతంగా ఉంటుందని నేను ఆశిస్తున్నాను. అందుకోసం మా టీమ్ చాలా కష్టపడుతుంది. కల్కి 2898AD మా అందరికీ ఒక మెగా లెర్నింగ్. మేము ఇప్పటికే కల్కి పార్ట్-2 కోసం పని చేయడం ప్రారంభించాము. ఈ మూవీలో పాల్గొనే నటీనటుల తేదీలు సర్దుబాటు అయిన తర్వాత, షూటింగ్ ప్రారంభమవుతుంది.' అని ఆయన అన్నారు. సంతోష్ నారాయణన్ చేసిన తాజా ప్రకటనతో అంచనాలను గణనీయంగా పెంచారు. దీంతో ఇప్పుడు అందరి దృష్టి సీక్వెల్‌పైనే ఉంది. భారీ బడ్జెట్‌తో వైజయంతీ మూవీస్ సంస్థ నిర్మిస్తున్న ఈ మూవీలో ప్రభాస్‌తో పాటు అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్ తదితరులు కీలక పాత్రలలలో పోషిస్తున్నారు. ఫిబ్రవరి నుంచి చిత్రీకరణ ప్రారంభం కానున్నట్లు సమాచారం. అయితే, ప్రభాస్ మార్చి తర్వాత కల్కి-2 సెట్‌లోకి అడుగు పెట్టనున్నట్లు తెలుస్తోంది. ప్రభాస్ ఇందులో భైరవగా, కర్ణగా రెండు పాత్రల్లో కనిపించనున్నారు.



# నా శరీరం.. నా ఇష్టం..

బాడీ షేమింగ్‌కు గుర్రై ఆత్మహత్యలు చేసుకునేవారంతా తన దృష్టిలో మూర్ఖులేనని అన్నారు ప్రముఖ నటి రచితా రామ్. రజనీకాంత్ 'కూలి' సినిమాతో తెలుగు ప్రేక్షకుల కు కూడా దగ్గరైన నటి రచితా రామ్. ఆ సినిమాలో మాస్ విలన్ పాత్రలో నటించి, మెప్పించింది. ప్రస్తుతం కన్నడ సినిమాలతో బిజీగా ఉన్నారు. ఆమె నటించిన తాజా కన్నడ చిత్రం 'కల్ట్' ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఈవెంట్‌లో బాడీ షేమింగ్ గురించి రచితా(Rachita Ram) మాట్లాడారు. చాలా మంది ఆడపిల్లలాగే తాను కూడా బాడీ షేమింగ్ ఎదుర్కొన్నానని.. కానీ దాన్ని చాలా తెలివిగా హ్యాండిల్ చేశానని చెప్పారు. వాళ్ల కామెంట్స్‌ని పట్టించుకోకుండా..మన పని మనం చేసుకుంటే సరిపోతుందని ఆమె సలహా ఇచ్చారు. 'ప్రతి మహిళ శరీరంలో మార్పులు వస్తుంటాయి. ఒక్కొక్కరు ఒక్కో కారణంతో బరువు పెరుగుతుంటారు. పీసీఓడీ, ఒత్తిడి వల్ల కొంతమంది లావు అవుతుంటారు. పీరియడ్స్‌కి ముందు, తర్వాత కూడా శరీరంలో మార్పులు వస్తుంటాయి. నిద్ర కూడా మన శరీరంపై ప్రభావం చూపుతుంది. కొంతమందికి ఎనిమిది గంట నిద్ర కచ్చితంగా అవసరం ఉంటుంది. లేదంటే వాళ్ల బాడీలో మార్పులు వచ్చేస్తుంటాయి. నేను కూడా ఆ లిస్ట్‌లోకి వస్తా. నేను సరిగా నిద్రపోకపోతే.. ఉదయం నా మొఖం చాలా ఉబ్బుగా కనిపిస్తుంది. కొన్ని గంటల తర్వాత మళ్లీ సన్నబడుతుంది. నాతో పని చేసే దర్శకులు కూడా ఇది గమనించి చెప్పారు. ఇలాంటి సమస్యలు చాలా మంది మహిళలకు ఉంటాయి. ఇవన్నీ బయటకు చెప్పుకోవాల్సిన అవసరం లేదు. మనకి నచ్చినట్లుగా మనం ఉండాలి. ఇది నా శరీరం.. నా ఇష్టం. ఎందుకు లావు అయ్యామో.. ఎందుకు సన్నబడ్డామో అనే విషయాలను ఎవరికీ వివరించాల్సిన అవసరం లేదు. మన ఆరోగ్యం గురించి వేరేవాళ్లకు సమాధానం చెప్పుకోవాల్సిన అవసరం లేదు. అని రచితా చెప్పుకొచ్చారు. అలాగే ఆన్‌లైన్‌లో వచ్చే నెగెటివ్ కామెంట్స్, ట్రోలింగ్‌ని ఎలా హ్యాండిల్ చేయాలనేదాని గురించి మాట్లాడుతూ.. ' అసలు నెగెటివ్ కామెంట్స్‌ని ఎందుకు చూడాలి? ఎందుకు వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి? అలాంటి విషయాలను మీరు మైండ్‌లోకి తీసుకోకండి. వాటిని పట్టించుకోకుండా.. మన పని మనం చేసుకుంటేనే ప్రశాంతంగా ఉంటాం' అని రచితా రామ్ చెప్పుకొచ్చింది.



## ప్రియాంక చోప్రాపై మహేష్ బాబు ప్రశంసలు

మహా: గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రాపై టాలీవుడ్ సూపర్‌స్టార్ మహేశ్ బాబు ప్రశంసల వర్షం కురిపించారు. ప్రియాంక ప్రధాన పాత్రలో నటించిన హాలీవుడ్ యాక్షన్ థ్రిల్లర్ 'ది బ్లఫ్' ట్రైలర్‌ను చూసిన మహేశ్, సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ఆమె నటనను కొనియాడుతూ ఆసక్తికరమైన పోస్ట్ పెట్టారు. "ట్రైలర్ అద్భుతంగా ఉంది. ప్రియాంక చోప్రా మరోసారి రాజీపడని, దృఢమైన నటన కనబరిచారు. ఫిబ్రవరి 25న విడుదలవుతున్న 'ది బ్లఫ్' చిత్ర బృందానికి నా శుభాకాంక్షలు" అని మహేశ్ బాబు తన పోస్ట్‌లో పేర్కొన్నారు. 'ది బ్లఫ్' చిత్రం 1800ల కాలం నాటి కథతో తెరకెక్కుతోంది. ఇందులో ఎర్సెల్ బోడెన్ అనే ఒక మాజీ సముద్రపు దొంగ పాత్రలో ప్రియాంక కనిపించనున్నారు. తన బిడ్డను కాపాడుకోవడం కోసం ఎంతకైనా తెగించే తల్లిగా ఆమె నటన ట్రైలర్‌లో ఆకట్టుకుంటోంది. ప్రముఖ దర్శకులు రూసో బ్రదర్స్ నిర్మిస్తున్న ఈ సినిమా, ఫిబ్రవరి 25న ప్రైమ్ వీడియోలో విడుదల కానుంది.

## విజయ్ దేవరకొండ ఫ్యాన్స్‌కి గుడ్ న్యూస్

విజయ్ దేవరకొండ, రష్మిక జంటగా ఓ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. రాహుల్ సంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం టైటిల్‌ని ఇప్పటి వరకు ప్రకటించలేదు. వీడీ14 అనే వర్కింగ్ టైటిల్‌తో షూటింగ్ ప్రారంభించారు. అయితే రిపబ్లిక్ డే సందర్భంగా రౌడీ ఫ్యాన్స్‌కి మేకర్స్ గుడ్ న్యూస్ చెప్పారు. ఈ సినిమా టైటిల్‌ని జనవరి 26న అనౌన్స్ చేయబోతున్నట్లు ప్రకటించారు. ఈ సినిమా బ్రిటీష్ కాలం నేపథ్యంతో పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కనుంది. 19వ సెంచరీ నేపథ్యంతో 1854 నుంచి 1878 మధ్య కాలంలో జరిగిన యదార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌గా "వీడీ 14" సినిమా రూపొందుతోంది. 'డియర్ కామ్రేడ్', 'ఖుషి' వంటి సక్సెస్ ఫుల్ సినిమాల తర్వాత మైత్రీ మూవీ మేకర్స్, విజయ్ కలిసి చేస్తున్న మూడో చిత్రమిది. 'టాక్సీవాలా' లాంటి సూపర్ హిట్ తర్వాత విజయ్ దేవరకొండ, రాహుల్ సంకృత్యన్ ఈ సినిమాతో మరోసారి కలిసి పనిచేస్తున్నారు.




EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020,
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com